'కార్పొరేట్' వల..



● సంవత్సరాల వారీగా ఉత్తీర్ణత శాతం..

విద్యాసంవత్సరం	ఉత్తీర్ణత శాతం
2016 - 2017	87.3
2017 - 2018	91.3
2018 - 2019	97.7
2019 - 2020	100
2020 - 2021	100
2021 - 2022	95.76
2022 - 2023	94.37
2023 - 2024	98.27

- ఇంటర్ అడ్మిషన్ల కోసం మొదలైన వేట
- రంగంలోకి ప్రైవేటు కళాశాలల పీఆర్వోలు
- పదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్‌కాల్
- పరీక్షలు కాకముందే తల్లిదండ్రులతో ఒప్పందాలు
- జిల్లాలో 6,767మంది విద్యార్థులు

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

పదో తరగతి విద్యార్థులను తమ కళాశాలల్లో చేర్చుకునేందుకు ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలల యాజమాన్యాలు రంగంలోకి దిగాయి. కళాశాలల పీఆర్వోలు అడ్మిషన్ల కోసం రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలను సంప్రదించి ముందుగానే ఫోన్ నంబర్లు, అడ్రస్‌లు సేకరించి వేట ప్రారంభించారు. జిల్లాలో ఎన్నికల ప్రచారాన్ని తలపించే విధంగా పది పరీక్షలు ప్రారంభం కాకముందే ఇళ్లకు వెళ్లి అడ్మిషన్లకు ఒప్పందాలు చేసుకుంటున్నారు. కార్పొరేట్, ప్రైవేటు జూనియర్ కళాశాలల యాజమాన్యాలు 2025-2026 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రవేశాల కోసం హైదరాబాద్, కరీంనగర్ ప్రాంతాల నుంచి నిత్యం తల్లిదండ్రులకు ఫోన్ కాల్స్ వస్తున్నాయి. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా ఆలస్యంగా అడ్మిషన్లు తీసుకుంటే ఫీజులు ఎక్కువగా అడుగుతారని, సీట్లు దొరకవనే ఆందోళనతో కార్పొరేట్ కళాశాలల పీఆర్వోల వలలో పడుతున్నారు. తల్లిదండ్రుల ఇళ్లకు వెళ్లి వారిని ఒప్పించి అడ్మిషన్ ఒప్పందాలుచేస్తున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో పదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రులను సీట్లు దొరకవని భయపెడుతుండడంతో అప్పులు చేసి అడ్మిషన్లు తీసుకుంటున్నట్లుగా తెలుస్తోంది. ఫీజులు కూడా లక్షల్లోకి మారడంతో తమ పిల్లలకు మెరుగైన విద్యను అందించాలని ఆర్థికంగా ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.

● విస్తృతంగా ప్రచారం..

పదో తరగతి పరీక్షలు ప్రారంభం కాకముందే జిల్లాలోని విద్యార్థుల అడ్రస్‌లు, ఫోన్ నంబర్లు కన్సల్టెన్సీలు, ప్రైవేటు కళాశాలల పీఆర్వోలు సేకరించి పకడ్బందీగా అడ్మిషన్ల ప్రచారం జోరుగా సాగుతోంది. విద్యార్థుల తల్లిదండ్రుల వద్దకు వెళ్లి అడ్మిషన్లపై ఒత్తిడి పెంచి ఒక్కో విద్యార్థిపై అడ్వాన్స్‌లు తీసుకుంటున్నారు. అడ్మిషన్లు సేకరించిన పీఆర్వోకు ఒక విద్యార్థిపై రూ.6 వేల నుంచి రూ.8 వేల వరకు కమీషన్ అందుతున్నట్లు చెప్పుకుంటున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన విద్యార్థులు హైదరాబాద్ నగరంలోని కార్పొరేట్ కళాశాలల్లో చేరడానికి ఆసక్తి చూపుతున్నారు. జిల్లాలోని కళాశాలల్లో సరైన ల్యాబ్‌లు, లెక్చరర్లు లేకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు కూడా ప్రైవేటు కళాశాలల్లో చేర్పించడానికి మొగ్గు చూపుతున్నారు. హైదరాబాద్ కార్పొరేట్ కళాశాలల్లో చేర్పించిన విద్యార్థులు ఇబ్బందులు పడుతున్న సందర్భాలు ఉన్నాయి. పీఆర్వోలు, కన్సల్టెన్సీల మాటలు విని చేర్పించిన తరువాత హాస్టల్‌లో సరైన వసతి లేకపోవడం, భోజన సౌకర్యం సరిగా లేక చాలా మంది విద్యార్థులు తిరిగి వస్తున్న సందర్భాలు కనిపిస్తున్నాయి.

● 21 నుంచి పరీక్షలు.. 6,767 మంది విద్యార్థులు

రాజన్న సిరిసిల్ల జిల్లాలో జిల్లా పరిషత్, ప్రభుత్వ, మోడల్, కేజీబీవీ పాఠశాలలకు సంబంధించిన పది పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు 6,767 మంది ఉన్నారు. వీరిలో బాలురు 3,050 మంది, బాలికలు 3,717 మంది ఉన్నారు. జడ్పీ ఉన్నత పాఠశాలల్లో 3,028 మంది విద్యార్థులు ఉండగా, బాలురు 1,680 మంది, బాలికలు 1,348 మంది ఉన్నారు. మోడల్ స్కూల్‌లలో 590 మంది ఉండగా, బాలురు 285 మంది, బాలికలు 305 మంది ఉన్నారు. మైనార్టీ వేల్ఫేర్ పాఠశాలలో 74 మంది ఉండగా, బాలురు 29 మంది, బాలికలు 45 మంది ఉన్నారు. బీసీ రెసిడెన్షియల్‌లో 263 మంది ఉండగా, బాలురు 121 మంది, బాలికలు 142 మంది ఉన్నారు. తెలంగాణ రెసిడెన్షియల్ పాఠశాలలో 74 మంది, సోషల్ వేల్ఫేర్‌లో 520 మంది ఉండగా, బాలురు 78 మంది, బాలికలు 442 మంది ఉన్నారు. ట్రైబల్ వేల్ఫేర్‌లో 74 మంది బాలికలు ఉండగా, కేజీబీవీలో 508 మంది, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 116 మంది బాలురు 66 మంది, బాలికలు 50 మంది ఉన్నారు. ప్రైవేటు పాఠశాలల్లో 1,451 మంది ఉండగా, బాలురు 790 మంది, బాలికలు 661 మంది ఉన్నారు.

కాగా, పదోతరగతి విద్యార్థులకు ఈనెల 21 నుంచి ఏప్రిల్ 2వ తేది వరకు పరీక్షలు జరగనున్నాయి. ఉదయం 9.30 గంటల నుంచి 12.30 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి. మార్చి 21న మొదటి లాంగ్వేజ్ పరీక్ష తెలుగు, 22న రెండవ లాంగ్వేజ్ పరీక్ష హిందీ, 24న ఇంగ్లీష్, ...

మిగతా 8లో

నేడు రాజన్న కల్యాణ మహోత్సవం

- అంగరంగ వైభవంగా ఏర్పాట్లు

6



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ మహేష్‌బాబా సాహెబ్

కేసీఆర్, కేటీఆర్, జగదీష్‌రెడ్డి దిష్టిబొమ్మల దహనం

- స్పీకర్‌కు క్షమాపణ చెప్పాలని డిమాండ్

8



సిరిసిల్లలో కేసీఆర్, కేటీఆర్, జగదీశ్వర్‌రెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నిప్పుల కొలిమి..

- వీర్నపల్లిలో 41.5 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు

సిరిసిల్ల మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : ఎండలు మండిపోతున్నాయి. ప్రజలు వేడిగాలుకు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. నిప్పుల కొలిమిలా మారుతుండడంతో మధ్యాహ్నం వేళ బయటకు రావడానికి ప్రజలు భయపడుతున్నారు ఆదివారం రాజన్న సిరిసిల్ల జిల్లాలో కనిష్ఠ ఉష్ణోగ్రత 18.4డిగ్రీలుగా, గరిష్ఠ ఉష్ణోగ్రత 41.5 డిగ్రీలు నమోదయ్యాయి. జిల్లాలో ఎండ తీవ్రతకు ప్రధాన జన సంచారంగా ఉండే ప్రాంతాలు వెలవెలబోతున్నాయి. ప్రజలు ఉదయం సాయంత్రం వేళల్లోనే బయటకు వస్తున్నారు. వీర్నపల్లి మండలంలో 41.5 డిగ్రీలు, కోనరావుపేటలో 41.4, సిరిసిల్లలో 41.2, చందుర్తి, వేములవాడ రూరల్ మండలాల్లో 40.9 డిగ్రీలు, గంభీరావుపేటలో 40.2 డిగ్రీలు, రుద్రంగి, ఇల్లంతకుంట, బోయిన్‌పల్లిలో 42.2 డిగ్రీలు, ఎల్లారెడ్డిపేటలో 40.0 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మార్చిలోనే ఎండలు ముదిరిపోతుండడంతో రాబోయే రెండు నెలలు పరిస్థితి ఎలా ఉంటుందోనని ప్రజలు ఆందోళన చేస్తున్నారు.

కన్నుల పండువగా వెంకన్న కల్యాణం

ముస్తాబాద్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గూడెంలో కన్నుల పండువగా శ్రీలక్ష్మీవెంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య నేత్రపర్వంగా నిర్వహించారు. పలు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులు ఒడిబియ్యం పోశారు. కట్నకానుకలు సమర్పించుకున్నారు. చిట్నేని వెంకటేశ్వర్‌రావు, గంభీరావుపేట బాలయ్య, చిట్నేని అంజనేయారావు, కనమేని చక్రధర్ రెడ్డి, ఎల్లాగౌడ్, చాడ శ్రీనివాస్, బొప్ప శ్రీధర్, గిరి ఆలయ అర్చకులు ప్రవీణాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

అసమ్మతి రాజకీయాలను ఉపేక్షించేది లేదు

- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్

సిరిసిల్ల /సిరిసిల్ల రూరల్ మార్చి 16 (ఆంధ్రజ్యోతి): పార్టీ నాయకులు కలిసిమెలిసి ఉండాలని, అసమ్మతి రాజకీయాలు చేస్తే ఉపేక్షించే ప్రసక్తే లేదని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. ఆదివారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో మున్నూరు కాపు ఫంక్షన్ హాల్‌లో జిల్లా బీజేపీ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా రెడ్డబోయిన గోపి బాధ్యతలను స్వీకరించారు. బండి సంజయ్‌ను రగుడు చౌరస్తా బైక్ ర్యాలీతో ఘనంగా స్వాగతించారు. ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ రాష్ట్రంలో బీజేపీకి మంచి వాతావరణం ఉందని, దాన్ని చెడగొట్టొద్దని సూచించారు. రాబోయేవి కార్యకర్తల ఎన్నికలేనని, స్థానిక ఎన్నికల్లో కార్యకర్తలను గెలిపించాల్సిన బాధ్యత మాదని అన్నారు.. సెస్ ఎన్నికల్లో బీజేపీ గెలిస్తే.. భయపెట్టి బెదిరించి బీఆర్ఎస్ గెలిచినట్లు అరాచకాలు చేసిన నీచ చరిత్ర బీఆర్ఎస్‌దేనని, ఎవరెన్ని చేసినా ప్రజలు బీజేపీవైపే ఉన్నారన్నారు. గోపి బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా బాధ్యత లు చేపట్టడం సంతోషకరమన్నారు. తనకు గ్రూపుల్లేవని, తన ఒకటే బీజేపీ గ్రూప్, మోదీ గ్రూప్ మాత్రమేనన్నా రు. సిరిసిల్ల కార్యకర్తలు పోరాటయోధులని, బీఆర్ఎస్ పాలనలో యువరాజు సిరిసిల్లకు వస్తుంటే అడుగడుగు నా అడ్డుకుని ప్రజావ్యతిరేక పాలనపై పెద్దఎత్తున పోరా టాలు చేశారని, ఆ భయానికే యువరాజు తాను వచ్చేముందు బీజేపీ కార్యకర్తలను ముందస్తు అరెస్టులు చేసి జైలుకు పంపేటోడన్నారు. అయినా తెగించి కొట్లాడిన చరిత్ర బీజేపీ సిరిసిల్ల కార్యకర్తలదన్నారు. అధికారం ఉందని అరాచకాలు చేసే సంస్కృతి బీజేపీకి లేదని, అధి కారం శాశ్వతం కాదని, ప్రజల మనసుల్లో శాశ్వతంగా నిలిచిపోయి, వారి సమస్యలను పరిష్కరించడమే మన బాధ్యత అన్నారు. తెలంగాణకు కేంద్రం పెద్ద ఎత్తున నిధులిస్తోందని, గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి అంతా కేంద్ర నిధులతోనే జరుగుతున్నాయని అన్నారు. రాష్ట్రం నయాపైసా ఇస్తలేని, అయినా తెలంగాణకు కేంద్రం ఏమిచ్చిందని ఎదురుదాడి చేస్తున్నారని అన్నారు. డబుల్ ఇంజన్ సర్కార్‌తో తెలంగాణను ఎట్లా అభివృద్ధి చేస్తామో చేతల్లో చూపిస్తామని అన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ ఒక్కటే. రెండు పార్టీలు డ్రామాలాడుతున్నాయని, బీఆర్ఎస్ చేసిన స్కాంల్లో అరెస్టు కాకుండా కాపాడుతోందని అన్నారు. ఫోన్ ట్యాపింగ్, డ్రగ్స్ ఫార్ములా. ఈ రేసు, భూముల కుంభకోణం, కాళేశ్వరం సహా అన్ని స్కాముల్లో కేసీఆర్ కుటుంబం ఉందని తెలిసినా అరెస్టు చేయలేదన్నారు. కనీసం నోటీసులు కూడా ఇచ్చే దమ్ములేదని అన్నారు. కనీసం కేసీఆర్‌ను విచారణకు పిలిచే దమ్ము లేదని, ఎందుకంటే రెండు పార్టీలూ ఒక్కటేనన్నారు. బీజేపీ ఇమేజ్‌ను దెబ్బతీసేందుకు కలిసి పనిచేస్తున్నాయని అన్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీని ఓడించేందుకు ఆ రెండు పార్టీలు కలిసి పోటీ చేసినా ఆశ్చర్యం లేదని, కాంగ్రెస్, బీఆర్ఎస్ ను వదిలిపెట్టే ప్రసక్తే లేదని బీజేపీ అధికారంలోకి రాగానే వాళ్ల లెక్కలు తేలుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి, పార్లమెంట్ కన్వీనర్ ప్రవీణ్‌రావు, కో కన్వీనర్ అడెపు రవీందర్. వేములవాడ ఇంచార్జి డాక్టర్ చెన్నమనేని వికాస్‌రావు,బీజేపీ రాష్ట కార్యదర్శి లింగంపల్లి శంకర్, రాష్ట కమిటీ సభ్యులు అల్లాడి రమేష్, ఎర్రం మహేష్,హనుమంతు గౌడ్, రాంప్రసాద్, మట్ట వెంకటేశ్వర్ రెడ్డి, మహిళమోర్చ జిల్లా అధ్యక్షురాలు పల్లం అన్నపూర్ణ, నియోజవర్గ ఇంచార్జి మల్లారెడ్డి ,పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



బండి సంజయ్, గోపిలను సన్మానిస్తున్న నాయకులు

కాషాయ జెండాలను ఎగురవేద్దాం..

సిరిసిల్ల రూరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : జరుగబోయే స్థానిక సంస్థల ఎన్నికలల్లో అన్ని స్థానాల్లో కాషాయ జెండాలను ఎగురవేద్దామని దీనికి ప్రతి కార్యకర్త సైనికునిగా పనిచేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపీ కోరారు. సిరిసిల్ల పట్టణంలో మున్నూరు కాపు కళ్యాణ మండపంలో ఆదివారం బీజేపీ జిల్లా కమిటీ అధ్వర్యంలో కార్యకర్తల ఆత్మీయ సమ్మేళాన్ని నిర్వహించారు. ఈ సందర్బంగా జరిగిన సమావేశంలో జిల్లాఅధ్యక్షుడు గోపీ మాటాడుతూ దేశం మొత్తం ప్రధాన మంత్రి నరేంద్రమోడీ పాలన వైపు చూస్తున్నారని అందుకే దేశంలో మూడోసారీ బీజేపీ ప్రభుత్వం అధికారంలో ఉందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో 4 ఎంపీ స్థానాలను బీజేపీ కైవసం చేసుకుందన్నారు. అదే స్పూర్తితో ఇటీవల జరిగిన ఉపాధ్యాయు ఎమ్మెల్సీ, పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలను సైతం బీజేపీ అభ్యర్థులు గెలుపొందారని అన్నారు. అదే స్పూర్థితో త్వరలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వార్డు సభ్యుడి స్థాయి నుంచి జడ్పీటీసీ వరకు బీజేపీ అభ్యర్థులు పోటీలో ఉంటారని వారందరిని గెలిపించుకుని గ్రామపంచాయతీలతో పాటు మండల, జిల్లా పరిషత్ లపై కాషాయం జెండాలను ఎగురువేసేందుకు కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. వేములవాడ నియోజకవర్గ ఇంచార్జ్ డాక్టర్ చెన్నమనేని వికాష్‌రావు మాట్లాడుతూ ప్రజలంతా బీజేపీ వైపు చూస్తున్నారడానికి ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికలు నిదర్శనమన్నారు. ప్రతి ఒక్క కార్యకర్త సైనికులతో సామానంగా పనిచేస్తేనే జరుగబోయే ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలుపించుకునే అవకాశం ఉందని అన్నారు. ప్రతి ఒక్క కార్యకర్త క్రమశిక్షణతో పనిచేయాలని కోరారు.

ఈ సమావేశంలో మహిళా మోర్చా పట్టణ అధ్యక్షురాలు వేముల వైశాలీ, జిల్లా ఉపాధ్యక్షురాలు పండుగ మాధవి, అసాని లావణ్య, జిల్లా కార్యదర్శులు కమటం మంజుల, దుంపెన స్రవంతిలతో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పొట్టి శ్రీరాములు జయంతి



వేములవాడలో నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

వేములవాడ, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : అమరజీవి పొట్టి శ్రీరాములు 124వ జయంతి వేడుకలు ఆదివారం వేములవాడ పట్టణంలో ఘనంగా నిర్వహించారు. తెలంగాణ చౌక్‌లో పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు సిద్ధంశెట్టి వేణు మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి అమరులైన గొప్ప నాయకుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బుస్స దశరథం, పట్టణ సంఘం బిల్డింగ్ కమిటీ చైర్మన్ కట్కూరి శ్రీనివాస్, పట్టణ ఆర్యవైశ్య సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ మద్ది సత్యనారాయణ, కొత్త అనిల్, ఉపాధ్యక్షుడు వెంకటేశం, అదనపు కోశాధికారి గుండా అశోక్, జాయింట్ సెక్రెటరీ గజవాడ మహేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీ పైడి కృష్ణ, సేవాదల్ కమిటీ అధ్యక్షుడు యాద సంతోష్, గౌరవ అధ్యక్షుడు నగుబోతు రవీందర్, కటకం జనార్ధన్, బాసెట్టి రవీందర్, కటకం నాగరాజు, చకినాల అశోక్, శివ సాయి, ఎర్రవెల్లి రాజశేఖర్, సెస్ మాజీ చైర్మన్ అల్లాడి రమేష్, ఐత వెంకటేశ్వర్లు, వైశ్య నాయకులు ఎర్ర శ్రీనివాస్, కొమురవెల్లి శ్రీకాంత్, చేపూరి రమేష్, తమ్మిశెట్టి అశోక్, సిద్ధంశెట్టి సంతోష్, కటకం అశోక్, కాచం శ్రీనివాస్, నరాల సంపత్, దెబ్బటి శ్రీనివాస్, కటకం అంజనేయులు, విజయ్, బండ వేణు, కటకం అనిల్, చేపూరి సురేష్, కొమురవెల్లి శివుడు, మంచాల రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మూతపడ్డ పరిశ్రమలు తెరిపించాలి

తంగళ్లపల్లి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : టెక్స్‌టైల్ పార్కులో మూతపడ్డ పరిశ్రమలను ప్రభుత్వం తెరిపించి కార్మికులకు ఉపాధి కల్పించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ డిమాండ్ చేశారు. ఆదివారం తంగళ్లపల్లి మండలం బద్దనపల్లి టెక్స్‌టైల్ పార్కును సందర్శించి కార్మికులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే మొట్ట మొదటి టెక్స్‌టైల్ పార్కు పరిస్థితి దీనాస్థితిలో ఉందన్నారు. వేలాది మంది కార్మికుల ఉపాధి కోసం ఏర్పాటు చేసిన టెక్స్‌టైల్ పార్కులో సగానికి పైగా పరిశ్రమలు మూతపడడంతో కార్మికులు ఉపాధి కోల్పోయి ఇతర ప్రాంతాలకు వలసవెళ్లి పనులు చేసుకునే దుస్థితి నెలకొందన్నారు. ప్రభుత్వాలు పట్టించుకోవడంతో ఈ పరిస్థితి నెలకొందని ఇప్పటికైనా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మూతపడ్డ పరిశ్రమలు తెరిపించి కార్మికులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకుంటే రానున్న రోజుల్లో సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు స్కైలాబ్ బాబు, జిల్లా కార్యదర్శి మూషం రమేశ్, కోడం రమణ, జవ్వాజి విమల, అన్నల్‌దాస్ గణేష్, ఎలిగేటి రాజశేఖర్, కూచన శంకర్, గడ్డం రాజశేఖర్ పాల్గొన్నారు.

స్పీకర్‌ను అవమానించడం హేయమైన చర్య

- ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ టౌన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : శాసనసభ స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఆర్ఎస్ నాయకురాలా ఖబడ్దార్ అంటూ వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ బీఆర్ఎస్ నాయకులపై ఘాటు వ్యాఖ్యలుచేశారు. శాసనసభ స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా వేములవాడ మున్సిపల్ పరిధిలోని తిప్పాపూర్ ఆర్టీసీ బస్టాండు ముందు జగదీశ్వర్‌రెడ్డి, కేటీఆర్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీలోని నాయకులైన జగదీశ్వర్‌రెడ్డి, కేటీఆర్ మాట్లాడే మాటలు అహంకారపూరితమైనవన్నారు. వాళ్లకు గవర్నర్ అంటే గౌరవం లేదని, స్పీకర్ అంటే లెక్కలేదని విమర్శించారు. మంత్రులుగా పని చేసిన అనుభవం ఉండి రాజ్యాంగ బద్ధంగా వ్యవహరించాల్సిన వారు స్పీకర్ చైర్‌ను అవమానపరచడం హేయమైన చర్యని మండిపడ్డారు. దళితబిడ్డ అయిన స్పీకర్‌ను అవమాన పరచడంతో యావత్ దేశం తెలంగాణ వైపు చూసి నివ్వెరపోయిందని అన్నారు. గవర్నర్ ప్రవేశపెట్టిన తీర్మానానికి ధన్యవాదాలు తెలుపాలని కోరితే దౌర్జన్యంగా వ్యవహరించారని, జగదీశ్వర్‌రెడ్డి అనే మూర్ఖుడు మాట్లాడిన మాటలు తప్పు కాదు అన్నట్లు కేటీఆర్ అతన్ని సమర్థించడం సిగ్గుచేటు అని అన్నారు. ఇప్పటికే తామే అధికారంలో ఉన్నామనే భ్రమలో బతుకుతున్నారని ఎద్దేవా చేశారు. అప్పుల్లో కూరుకుపోయిన రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్లేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తే అడ్డుకుంటున్నారన్నారు. నాయకులు మార్కెట్ కమిటీ చైర్మన్ రాజు, వైస్‌చైర్మన్ కనిక రపు రాకేష్, నాయకులు ఇప్పపూల అజయ్, కూరగాయల కొమురయ్య, సాగరం వెంకటస్వామి, సంద్రగిరి శ్రీనివాస్, వకులభరణం శ్రీనివాస్, తూం మదు, నాగుల విష్ణు, అరుణ్‌తేజాచారీ, అంబటి చంద్రశేఖర్‌యాదవ్ ఉన్నారు.



వేములవాడలో కేటీఆర్, జగదీష్‌రెడ్డిల దిష్టిబొమ్మలను దహనం చేస్తున్న ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు

వేములవాడ అర్బన్ మండలంలో..

వేములవాడ అర్బన్ మండలంలో నందికమాన్ చౌరస్తా వద్ద కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పిల్లి కనుకయ్య ఆధ్వర్యంలో జగదీశ్వర్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఎర్రం రాజు, చింతపల్లి శ్రీనివాస్‌రావు, గాలిపెల్లి స్వామి తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకులు

బోయినపల్లి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : బోయినపల్లి మండలం వెంకట్రావుపల్లి గ్రామానికి చెందిన కొంత మంది యువజన కాంగ్రెస్ నాయకులు ఆదివారం బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్బంగా చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు.

ఈఎస్ఐ హాస్పిటల్‌పై కేంద్ర మంత్రి సమాధానం ఇవ్వాలి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ

సిరిసిల్ల రూరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్లలో లక్షలాది మంది కార్మికులు నివాసం ఉంటున్నారని, వారికి వైద్యం నిమిత్తం ఏర్పాటు చేస్తామన్న ఈఎస్ఐ హాస్పిటల్‌కు మోక్షం లబిస్తుందా లేదా అనే దానిపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ సమాధానం ఇవ్వాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్ని పార్టీల నాయకులతో అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటుచేసి బీజేపీ విధానాలపై రాష్ట్ర ప్రభుత్వం తరపున ఒత్తిడి తేవాలన్నారు. సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఆదివారం సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో విస్తృతస్థాయి సమావేశాన్ని ఏర్పాటుచేశారు. ఈ సమావేశానికి హాజరైన జాన్‌వెస్లీ మాట్లాడుతూ సిరిసిల్లలో లక్షలాది మంది కార్మికులు నివాసం ఉంటున్నారని, వారికి వైద్యం నిమిత్తం ఏర్పాటు చేస్తామన్న ఈఎస్ఐ హాస్పిటల్‌కు మోక్షం లభిస్తుందా లేదా అనే దానిపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మత విద్వేషాలు రెచ్చగొట్టడం తప్ప ప్రజల కష్టాలు ఆయనకు పట్టవన్నారు. కరీంనగర్ ఎంపీగా గెలిచినప్పటి నుంచి సిరిసిల్ల జిల్లా అభివృద్ధికి నయాపైసా ఖర్చు పెట్టలేదన్నారు. ప్రజలు బండి సంజయ్‌కుమార్‌ను నిలదీయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 17 నెలలు గడుస్తున్నా ప్రజలకు అమలు చేస్తామన్న హామీలను అమలు చేయడంలేదన్నారు. ఈసారీ అసెంబ్లీలో జరిగే బడ్జెట్‌లో కార్మికులు, సామాన్య ప్రజల కోసం నిధులను కేటాయించాలన్నారు. రైతురుణమాఫీ ఇంకా 10వేల కోట్లు ఇవ్వలేదన్నారు. రైతు భరోసా ఎక్కడా కూడా అమలు కాలేదన్నారు. వ్యవసాయ కూలీలకు రూ.12వేలు ఇవ్వడం లేదన్నారు. మహిళలకు 2500, దళితులకు రూ12లక్షలు, అభయహస్తం అమలు కాలేదన్నారు. 2లక్షల ఉద్యోగాలు ఇస్తామన్న మాటను నిలబెట్టుకోలేదన్నారు. పెన్షన్‌ల ఊసే లేకుండా పోయిందని, రాష్ట్రంలో 30లక్షల కుటుంబాలకు ఇళ్లు ఇవ్వలేదన్నారు. ఎస్సీ, ఎస్టీలకు జనాభా ప్రాతిపాదికన కేటాయింపులు చేస్తున్నామని ప్రకటించి వాటిని కాగితాలకే పరిమితవుతున్నా ఖర్చులు పెట్టడం లేదన్నారు. బీసీ, మైనార్టీలకు ఏ ఒక్క హామీ అమలు చేయడం లేదన్నారు. ప్రజల్లో ఇప్పటికే వ్యతిరేకత వచ్చిందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను కాంగ్రెస్ పార్టీ అమలు చేయకుంటే గత బీఆర్ఎస్ ప్రభుత్వానికి పట్టిన గతే పడుతుందన్నారు. కేంద్రంలో బడ్జెట్‌లో తెలంగాణకు బీజేపీ పార్టీ అన్యాయం చేసిందన్నారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు స్కైలాబ్‌బాబు మాట్లాడుతూ సెంట్రల్ యూనివర్సిటీకి సంబంధించిన 400ఎకరాల భూములను అమ్మాలని రాష్ట్ర ప్రభుత్వం చూస్తోందన్నారు.ప్రభుత్వ పాఠశాలలో 99శాతం నిరుపేద విద్యా ర్థులు చదువుతున్నారని వారికి సరైన కేటాయిం పులు లేవన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి మూషం రమేష్, కార్యదర్శివర్గ సభ్యులు ఎగమం టి ఎల్లారెడ్డి, జివ్వాజి విమల, కోడం రమణ, మాల్లారపు అరుణ్‌కుమార్, జిల్లా కమిటీ సభ్యులు గన్నేరం నర్సయ్య, ఎర్రవెల్లి నాగరాజు, ముక్తికాంత అశోక్, అన్నల్‌దాస్‌గణేష్, మాల్లారపు ప్రశాంత్, ఎలిగేటి రాజశేఖర్, వివిధ ప్రజా సంఘాల నాయకులు గాంతుల మహేష్, రామంచ అశోక్, గుండెల్లి కళ్యాణ్‌కుమార్, రాజమల్లు, రాపెల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.



సిరిసిల్లలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

వృద్ధురాలి దారుణ హత్య


వెంకటమ్మ(ఫైల్)

కరీంనగర్ క్రైం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా కొత్తపల్లి శివారులో వృద్ధురాలిని గుర్తు తెలియని వ్యక్తులు గొంతుకోసి హత్య చేశారు. కరీంనగర్ రూరల్ సీఐ ప్రదీప్‌కుమార్ వివరాల ప్రకారం.. కొత్తపల్లి నుంచి దేశరాజపల్లి వెళ్లే రోడ్డులో ఎస్‌ఆర్‌ఎస్‌పీ కెనాల్ పక్కన వృద్ధురాలు రక్తపుమడుగులో ఉందని స్థానికులు ఆదివారం పోలీసులకు సమాచారం అందించారు. విచారణ చేపట్టిన పోలీసులు హత్యకు గురైంది జిల్లాలోని తిమ్మాపూర్ మండలం నుస్తులాపూర్ గ్రామానికి చెందిన వృద్ధురాలు తనుకు వెంకటమ్మ(70)గా గుర్తించారు. వెంకటమ్మ కోహెడ్ మండలం రాంచంద్రాపూర్‌లో తన పెద్ద కూతురు లక్ష్మీ వద్ద ఉండగా మనుమడు(లక్ష్మీ కుమారుడు పుల్లూరు చంద్రశేఖర్) ఫోన్‌చేసి ఎల్‌ఐసీ డబ్బులు తీసుకునేందుకు కరీంనగర్‌కు రావాలని సూచించాడు. దీంతో వెంకటమ్మ బస్సులో కరీంనగర్‌కు చేరుకుంది. ఆ తరువాత ఆమెఫోన్ స్విచ్‌ఆఫ్ అయ్యింది. వెంటకమ్మకు రావాల్సిన ఎల్‌ఐసీ డబ్బుల కోసం కొద్ది రోజుల కిందట దరఖాస్తు చేసుకుంది. డబ్బుల కోసం మనుమడు చంద్రశేఖర్ ఫోన్ చేయగా కరీంనగర్‌కు చేరుకున్న వెంకటమ్మ కార్యాలయానికి వెళ్లిందా? లేదా? అనేది తెలియడం లేదు. మరోవైపు వృద్ధురాలికి ఇద్దరు కూతుళ్లు కాగా పెద్ద కూతురు కొడుకు చంద్రశేఖర్‌ను దత్తత తీసుకుందని, అతడు వెంకటమ్మతోనే నుస్తులాపూర్‌లో ఉండేవాడని, కొంతకాలంగా కరీంనగర్ కోతిరాంపూర్‌లో నివాసం ఉంటున్నాడని బంధువులు తెలిపారు. గతంలో వెంకటమ్మను చంద్రశేఖర్ కొట్టినట్లు, తిమ్మాపూర్ పోలీసు స్టేషన్‌లో ఆమె ఫిర్యాదు చేసినట్లు సమాచారం. నుస్తులాపూర్‌లో వెంకటమ్మకు మూడు గుంటల స్థలం, ఇల్లు ఉందని, ఆ ఆస్తి కోసమే గొడవ జరిగి హత్యకు దారి తీసి నట్లుగా కూడా అనుమానాలు వ్యక్తమ వుతున్నాయి. నిందితులు పోలీసుల ఎదుట లొంగిపోయినట్లు తెలుస్తోంది.

ఉరేసుకొని ఒకరి బలవన్మరణం

కరీంనగర్ క్రైం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ హనుమాన్ నగర్‌కు చెందిన గంపల సంపత్(35) ఒంటరితనం భరించలేక మనోవేదనతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కరీంనగర్ వన్ టౌన్ సీఐ బిల్ల కోటేశ్వర్ వివరాల ప్రకారం.. హనుమాన్‌నగర్‌కు చెందిన సంపత్‌కు 16ఏళ్ల కిందట వివాహమైంది. ఐదేళ్లక్రితం భార్య విడాకులు తీసుకొని వెళ్లిపోయింది. అప్పటినుంచి సంపత్ వెల్డింగ్ పని చేసుకుంటూ తనతండ్రితోనే కలిసి నివసిస్తున్నాడు. స్థానిక అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మన్‌గా పనిచేస్తున్న తండ్రి శనివారం విధులకు వెళ్లాడు. ఆదివారం తిరిగి వచ్చేసరికి తలుపులు పెట్టి ఉన్నాయి. అనుమానంతో బలవంతంగా తలుపులు తెరిచిచూడగా ఇనుపరాడ్‌కు సంపత్ ఉరేసుకొని కనిపించాడు. భార్యతో విడాకుల కారణంగా మనోవేదనతో ఉరేసుకున్నాడని సంపత్ తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

ముస్తాబాద్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : కల్లు అనుకొని పురుగుల తాగి, వృద్ధురాలు చికిత్సపొందుతూ మృతిచెందిన ఘటన మండలంలోని పోతుగల్ గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై సీహెచ్ గణేశ్ ఆదివారం తెలిపినవివరాల ప్రకారం.. పోత్గల్‌కు చెందిన జెల్ల బాలవ్వ (85) కొంతకాలంగా మానసికపరిస్థితి బాగోలేక వింతగా ప్రవర్తిస్తోంది. పొలానికి కొట్టగా మిగిలిన మందును ఇంట్లో బాటిల్‌లో పోసి ఉంచగా కల్లు అనుకొని తాగింది. దీంతో పరిస్థితి విషమంగా మారడంతో సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాలవ్వకు చికిత్స అందిస్తుండగా చనిపోయినట్లు తెలిపారు. మృతురాలి మనవడు జెల్ల అజయ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విషజ్వరంతో మహిళ మృతి


ఆసియాబేగం (ఫైల్)

కాల్వశ్రీరాంపూర్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మొట్లపల్లి గ్రామానికి చెందిన ఎండీ ఆసియాబేగం(35)అనే మహిళ విషజ్వరంతో మృతిచెందింది. మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మూడు రోజులుగా జ్వరంరాగా జమ్మికుంటలోని ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స అందించారు. జ్వరం తగ్గడంతో అసుపత్రి నుంచి ఇంటికి తిరిగి వచ్చారు. శనివారం మళ్లీ జ్వరం రావడంతో కుటుంబసభ్యులు కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్సపొందుతూ ఆదివారం మృతిచెందింది. మృతురాలికి భర్త, కుమారుడు ఉన్నారు.

ఐదుగురిపై కేసు నమోదు

ఎల్లారెడ్డిపేట, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనాలు నడిపిన ఐదుగురిపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రమాకాంత్ తెలిపారు. ఎల్లారెడ్డిపేట గ్రామ శివారులోని కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారిపై ఎస్‌ఐ రమాకాంత్ ఆధ్వర్యంలోని పోలీసులు ఆదివారం వాహన తనిఖీలను నిర్వహించారు. వాహనదారుల ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు. మద్యం తాగి వాహనాలు నడుపుతూ ఐదుగురు పట్టుబడ్డారు. వారిపై కేసు నమోదు చేశారు.

అదృశ్యమైన మాజీ సర్పంచ్ మృతి

- మోహన్‌రావుపేటలో విషాదం


దేవక్క (ఫైల్)

కోరుట్ల రూరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : మూడు రోజుల క్రితం అదృశ్యమైన కోరుట్ల మండలం మోహన్‌రావుపేట మాజీ సర్పంచ్ పూదరి దేవక్క (72) మృతదేహం ఆదివారం మల్యాల మండలం మానాల గ్రామ శివారులోని ఎస్‌ఆర్‌ఎస్‌పీ కాలువలో లభ్యమయినట్లు పోలీసులు తెలిపారు. దేవక్క అనారోగ్యంతో బాధపడుతూ మూడు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాకపోవడంతో భర్త నర్సయ్య కోరుట్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో అదృశ్యం కేసు నమోదు చేశారు. మానాల గ్రామ శివారులో మహిళ మృతదేహం ఉందని అక్కడి పోలీసులు కోరుట్ల పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లగా దేవక్క బంధువులు ఆమె మృతదేహాన్ని గుర్తించారు. అనంతరం మృతదేహాన్ని కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. దేవక్క మృతితో మోహన్‌రావుపేట గ్రామంలో విషాదం నెలకొంది.

సింగరేణి క్వార్టర్‌లో చోరీ

యైటింక్లయిన్‌కాలనీ, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధి కాలనీలో శనివారం రాత్రి బొట్ల రాములు(టీటూ 1060) అనే సింగరేణి కార్మికుడి క్వార్టర్‌లో చోరీ జరిగింది. రెండు రోజుల క్రితం కుటుంబ సభ్యులందరూ ఊరికి వెళ్లి ఆదివారం తిరిగి వచ్చే సరికి దొంగతనం జరిగింది. తాళం పగులగొట్టి ఇంట్లో ఉన్న రూ.40వేల నగదు, 15తులాల వెండి ఆభరణాలను దుండగులు ఎత్తుకెళ్లారు. రాములు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా సివిల్ డిపార్ట్‌మెంట్ దారిలో టీటూ-568 క్వార్టర్‌లో నివాసం ఉండే రాజ్‌కుమార్ వారం రోజుల క్రితం ఊరు వెళ్లాడు. శనివారం తిరిగి వచ్చే సరికి గేట్ తాళం పగులగొట్టి ఉండడే గాక తలుపుకు వేసి తాళం పగులగొట్టే ప్రయత్నం చేశారు. తాళం రాకపోవడంతో దొంగలు అక్కడ నుంచి వెళ్లిపోయారు. వారం రోజుల క్రితం షిర్కే సమీపంలో ఇదే తరహాలో తాళం వేసిన ఉన్న క్వార్టర్‌లో చోరీకి పాల్పడిన దుండగులు వెండి ఆభరణాలు, నగదు ఎత్తుకెళ్లారు. వరుస చోరీలతో కార్మిక కుటుంబాలు ఆందోళన గురవుతున్నాయి.

నేడు రాజన్న కల్యాణ మహోత్సవం

- అంగరంగ వైభవంగా ఏర్పాట్లు
- భారీగా తరలిరానున్న భక్తులు

వేములవాడ కల్చరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ఆది దంపతులు శివపార్వతుల కల్యాణం చూద్దాం రారండి.. అంటూ దారులన్నీ రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ శైవక్షేత్రం వైపు చూస్తున్నాయి. సోమవారం రాజన్న ఆలయంలో శివపార్వతుల దివ్యకల్యాణం నిర్వహించనుండడంతో ఆదివారం రాజన్న క్షేత్రానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. రాజన్న ఆలయ ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 7 గంటలకు నుంచి ఉత్సవాలను ప్రారంభించారు. పుణ్యాహవాచనము, వర్ధపూజ, పంచగవ్య మిశ్రణము, గౌరీపూజ, రక్షబంధనం, ఆచార్య బ్రహ్మాదిబుత్విగ్వరణము, దీక్షాబందనము, మంటప ప్రతిష్ఠ తదుపరి మంటప ప్రవేశము ఘనంగా నిర్వహించారు. సాయంత్రం 3.05 గంటల నుంచి శ్రీస్వామి వారికి అంకురార్పణము, అగ్నిప్రతిష్ఠ-వాస్తుహోమం చేపట్టారు. సాయంత్రం 4 గంటల నుంచి శివ మహాపురాణ ప్రవచనము, రాత్రి 7.05 గంటలకు భేరీపూజ, దేవతా హ్వాన జరిపించారు. మంగళహారతి, మంత్ర పుష్పము అనంతరం తీర్థప్రసాద వితరణ గావించారు.

● నేడు నిర్వహించే పూజలు..

సోమవారం ఉదయం 7.05 గంటకు తీర్థరాజస్వామి పూజ, దేవతాహవనము, ద్వజారోహణము, ఎదుర్కోళ్లు నిర్వహించనున్నారు. ఉద యం 10.40 గంటల నుంచి 12.55 వరకు శ్రీపార్వతిపరమేశ్వరుల దివ్య కల్యాణ మహోత్సవము జరుగుతాయి. సాయంత్రం 5 గంటలకు లాజా హోమము, ఔపాసనము, బలిహరణ ముతో పాటుగా పెద్దసేవ ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.


రాజన్న ఆలయంలో సంప్రోక్షణ నిర్వహిస్తున్న అర్చకులు

● ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ..

వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో సోమ నిర్వహించే శివకల్యాణ మహోత్సవానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరానున్న నేపథ్యంలో ఏర్పాట్లను ఎస్పీ గీతే మహేష్‌బాబా సాహెబ్ ఆదివారం పరిశీలించారు. రాజన్న ఆలయ పరిసరాలతో పాటుగా పట్టణ ఆవరణ, కల్యాణ వేదిక పలు విభాగాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ ట్రాఫిక్ ఇబ్బందులు తలేత్తకుండా పార్కింగ్ స్థలాలు ఏర్పాట్లు, కళ్యాణ మండపం, గోశాల ఆలయంతో పాటుగా పరిసరా ప్రాంతాలో భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వెంట రాజన్న ఆలయ ఈవో వినోద్‌రెడ్డి, టౌన్ సీఐ వీరప్రసాద్, ఆలయ ఈఈ రాజేష్, ఏఈ రామ్‌కిషన్, ప్రొటోకాల్ ఏఈవో అశోక్ తదితరులు ఉన్నారు.


రాజన్న దర్శనం కోసం క్యూలో ఉన్న భక్తులు

● నెలకొన్న భక్తుల రద్దీ..

శివకల్యాణోత్స వాన్ని పురస్కరించుకుని వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆదివారం ఉదయం భక్తులు కళ్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకుని ఆలయ ధర్మగుండంలో పవిత్రస్నానాలు ఆచరించారు. రాజన్నకు కోడెమొక్కు చెల్లించుకునేందుకు భక్తులు గంటల తరబడి క్యూలైన్‌లో బారులు తీరారు. ధర్మదర్శనం, శీఘ్రదర్శనం, బ్రేక్‌దర్శనం క్యూలైన్‌ల ద్వారా భక్తులు ఆలయంలోకి చేరుకుని శ్రీపార్వతిపరమేశ్వరులను దర్శించుకున్నారు. రాజన్నకు అత్యంత ప్రీతికరమైన కోడెమొక్కు చెల్లించుకున్నారు.

రాజన్నకు పట్టువస్త్రాలు సమర్పించిన ఆది శ్రీనివాస్

వేములవాడ కల్చరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి ఆలయంలో సోమవారం నిర్వహించే శివ కల్యాణోత్సవానికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పట్టువస్త్రాలను సమర్పించారు. పట్టువస్త్రాలతో రాజన్న ఆలయానికి వచ్చిన ఆది శ్రీనివాస్‌కు ఆలయ ఈవో వినోద్‌రెడ్డి ఘనస్వాగతం పలికారు. ఆలయంలోకి ప్రవేశించి రాజన్న ప్రత్యేకపూజలో పాల్గొన్నారు. అనంతరం అద్దాల మండపంలో ఆలయ అర్చకులు ఆశీర్వచనం ఇవ్వగా, ఆలయ ఈవో రాజన్న ప్రసాదాన్ని అందజేశారు.


రాజన్నకు పట్టు వస్త్రాలు తీసుకువస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

పూడ్చిన మృత శిశువుకు పోస్టుమార్టం

ఎల్లారెడ్డిపేట, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లిలోని ఓ యువతి జన్మనిచ్చిన పసికందును ఎవరికీ తెలియకుండా మానేరు వాగులో పూడ్చివేయగా, పోలీసులు పోస్టుమార్టం నిర్వహించారు. సిరిసిల్ల శివారులోని మానేరు వాగులో ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసులు, తహసీల్ అధికారుల కథనం మేరకు.. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లిలోని ఓ యువతికి అదే గ్రామంలోని యువకుడితో పరిచయమై ప్రేమ దాకా వెళ్లింది. పెళ్లి ఊసు ఎత్తగానే ప్రియుడు ముఃఖం చాటేశాడు. తనకు న్యాయం చేయాలని యువతి పోలీసులను ఆశ్రయించింది. కేసు నమోదు చేసి యువకుడిని రిమాండ్‌కు తరలించారు. అప్పటికే యువతి గర్భం దాల్చడంతో ఆమెను కరీంనగర్‌లోని ప్రభుత్వ సంరక్షణ కేంద్రానికి తరలించారు. ఇటీవల యువతికి పురిటినొప్పులు రావడంతో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. ఆమె మృత ఆడశిశువుకు జన్మనివ్వడంతో కుటుంబ సభ్యులు కనులు తెరవని ఆడ శిశువును గుట్టు చప్పుడు కాకుండా సిరిసిల్లలోని మానేరు వాగులో ఇసుకలో పూడ్చివేశారు. అనుమానం వచ్చిన పోలీసులకు రాచర్లగొల్లపల్లిలోని యువతి ఇంటికి వెళ్లి ఆరోగ్య విషయంపై ఆరా తీశారు. ఇంటికి తాళం వేసి ఉండడం వల్ల ఏం జరిగిందోనని దర్యాప్తు ప్రారంభించారు. యువతి కుటుంబ సభ్యుల ద్వారా జరిగిన విషయం తెలుసుకున్నారు. ఎల్లారెడ్డిపేట రూరల్ సీఐ శ్రీనివాస్‌గౌడ్, తహసీల్దార్ రామచంద్రం ఆధ్వర్యంలోని సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని పూడ్చివేసిన శిశువు మృతదేహాన్ని వెలికితీయించారు. వైద్యుల సమక్షంలో పోస్టుమార్టం నిర్వహించి నమూనాలను సేకరించారు. డీఎన్‌ఏ పరీక్షల నిమిత్తం తరలించామని అధికారులు పేర్కొన్నారు.

ఆత్మహత్య చేసుకున్న మృతుల గుర్తింపు


గోలేటి శ్వేత


మినుగు రాహుల్

జమ్మికుంట రూరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మండలం బిజిగిరిషరీఫ్-పాపయ్యపల్లి గ్రామాల మధ్య రైల్వే ట్రాక్‌పై శనివారం రాత్రి ఓ యువతి, యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. యువకుడి ఆచూకీ రాత్రి తెలియరాగా, యువతి ఆచూకీని రైల్వేపోలీస్‌లు ఆదివారం వెల్లడించారు. ఇల్లందకుంట మండలం రాచపల్లి గ్రామానికి చెందిన మినుగు రాహుల్(18) ఎల్‌ఈడీ బల్బ్‌ల ఈవెంట్ వర్క్‌చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలం ఎర్వాచింతల్ గ్రామానికి చెందిన గోలేటి శ్వేత(20) కరీంనగర్ ఉమెన్స్ డిగ్రీకళాశాలలో ప్రథమ సంవత్సరం చదువుతోంది. అక్కడే ఓప్రైవేట్ హాస్టల్‌లో ఉంటోంది. రాహుల్ ఈవెంట్‌పై కరీంనగర్‌కు వెళ్లిన సమయంలో ఇద్దరిమధ్య పరిచయం ఏర్పడినట్లు తెలుస్తోంది. రాహుల్ కంటే శ్వేతకు రెండేళ్ల వయస్సు ఎక్కువ ఉండటంతో పెద్దలు ఒప్పుకుంటారోలేదో అని మనస్తాపానికి గురైనట్లు తెలుస్తోంది. రాహుల్ సాయంత్రం 4గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు రాగా, శ్వేత ఉదయం 8గంటలకు తండ్రికి ఫోన్‌చేసి కళాశాలకు వెళ్తున్నట్లుచెప్పింది. మళ్లీ11గంటల సమయంలో తండ్రిఫోన్‌చేస్తే స్విచ్‌ఆఫ్ వచ్చింది. అప్పటి నుంచి మళ్లీఫోన్ ఆన్‌కాలేదు. మరుసటి రోజు పోలీస్‌లనుంచి సమాచారం అందడంతో ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందని మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపారు. తమ కుమార్తె ఏ కారణం చేత ఆత్మహత్య చేసుకుందో తెలియదనిమృతురాలి తండ్రి రాజలింగు పోలీస్‌లకు ఫిర్యాదుచేశాడు. తమకుమారుడు ప్రేమవ్యవహారంతో ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి తండ్రి రాజు పోలీస్‌లకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్సై మహేందర్ తెలిపారు.

రైతులను బెంబేలెత్తిస్తున్న హైనా

- ప్రాణాలు కోల్పోతున్న పశువులు
- అటవీఅధికారులు చర్యలు చేపట్టాలని వేడుకోలు

చిగురుమామిడి, మార్చి 16: మండలంలో హైనాదాడులతో రైతులు బెంబేలెత్తిపోతున్నారు. సుందరగిరి, కొండపూర్, బొమ్మనపల్లి, పీచుపల్లి, గాగిరెడ్డిపల్లి, మూదిమాణిక్యం, రామంచ, ఇందుర్తి, నవాబుపేట తదితర గ్రామాల్లో పశువులపై హైనాదాడులు నిత్యకృత్యమయ్యాయి. ఉదయం పూట వ్యవసాయ బావుల వద్దకు వెళ్లేందుకు రైతులు జంకుతున్నారు. రాత్రిపూట పశువుల కొట్టాల్లో కట్టేసిన పశువులు తెల్లవారేసరికి ఉంటాయో లేదోనని రైతులు తీవ్ర భయాందోళనలు చెందుతున్నారు. అటవీ శాఖ అధికారులు రక్షణచర్యలు చేపట్టి హైనాదాడులను నివారించాలని మండల రైతులు కోరుతున్నారు. రెండు హైనాలు కలిస్తే మనుషులపైన కూడా దాడులు చేసే అవకాశం ఉందన్నారు. దీంతో వ్యవసాయ బావుల వద్దకు వెళ్లలేక పోతున్నామని రైతులు పేర్కొంటున్నారు. నష్టపోయిన రైతులందరికీ పరిహారం ఇవ్వడం కాకుండా శాశ్వత రక్షణ చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.


కొండపూర్‌లో హైనా దాడిలో మృతిచెందిన లేగ (ఫైల్)

హైనా దాడులను నివారించాలి..

తాళ్లపెల్లి తిరుపతిగౌడ్, రైతు, సుందరగిరి



మండలంలో ఇటీవల హైనా దాడుల్లో అనేక లేగ దూడలు, ఆవులు చనిపోయాయి. హైనా వరుస దాడులతో మండలంలో రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయాల్లో బావుల వద్దకు వెళ్లలేని పరిస్థితిలో రైతులు ఉన్నారు. సంబంధిత శాఖ అధికారులు, సిబ్బంది, రెవెన్యూ అధికారులు ఉమ్మడిగా హైనాల స్థావరాలను గుర్తించాలి. దీంతో మండలంలో హైనా దాడులు నివారణ జరుగుతుంది.



హైనాలను పట్టుకోవాలి.. అందె స్వామి, మాజీ జడ్పీటీసీ

ఇటివల మండలంలో అనేక గ్రామాల్లో హైనా దాడులు జరిగాయి. రైతులు వ్యవసాయ బావుల వద్దకు వెళ్లేందుకు జంకుతున్నారు. హైనా దాడులను నివారించేందుకు ప్రత్యేకంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి వాటి పట్టేయాలి. పశువులపై చేసిన విధంగానే హైనాలు మనుషలపై కూడా దాడులు చేసే అవకాశం ఉందని రైతులు భయపడుతున్నారు.

పశువైద్యంపై పట్టింపేది?

- పత్తా లేని గొర్రె, మేకల నట్టల నివారణ మందులు


రామడుగు మండల కేంద్రంలోని పశువైద్య కేంద్రం


రామడుగులో పశువులకు వైద్యం చేస్తున్న వైద్య సిబ్బంది

రామడుగు, మార్చి 16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి కారణంగా పశువులకు సరైనమందులు అందడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మండలంలో రెండు ప్రాథమిక పశువైద్యాకేంద్రాలు, ఒక ఉపకేంద్రం ఉంది. గత ప్రభుత్వం పశువుల వైద్యానికి పూర్తిస్థాయిలో నిధులు కేటాయించలేదని ఆరోపణలు ఉండగా, ప్రస్తుత ప్రభుత్వం కూడా అదే వైఖరిని కొనసాగిస్తోందని పాడిరైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● సమయానికి రాని మందులు..

మండలంలో 7వేల గేదెలు, ఆవులు ఉండగా, 30వేల మేకలు, గొర్రెలు ఉన్నాయి. అయితే రెండేళ్లుగా గొర్రెల, మేకలకు నట్టల నివారణ మందులు వేసిన దాఖలాలు లేవు. దీంతోపాటు పశువైద్యకేంద్రాలకు మూడు నెలలకొకసారి రావాల్సిన మందులు అటకెక్కాయి. సంవత్సరానికి ఒకటి లేదా రెండు సార్లు మందులు సరఫరా చేస్తున్న అవి సరైన సమయానికి రావడం లేదని తెలుస్తోంది. సీజన్‌లో వేయాల్సిన మందులు తర్వాత రావడంతో అవి పెద్దగా ఉపయోగ పడటం లేదని తెలుస్తోంది.

● మూగజీవాల అరణ్య రోదన..

సునందిని పథకం కింద దూడలకు దాన ఇచ్చే పరిస్థితి ఉండేది. ప్రస్తుతం ఆ పథకం అటకెక్కింది. పశుబీమాను పట్టించుకునే నాథుడు కరువయ్యాడు. మినీషీప్ యూనిట్లు లేకుండా పోయాయి. నట్టలనివారణ మందులు రెండేళ్లుగా సరఫరా చేయకపోవడంతో పశువులకు వాటిని అందజేసే పరిస్థితి లేకుండా పోయింది. గతంలో గిరిరాజా కోళ్లతోపాటు గొర్రెకాపరులకు గొర్రెలు అందజేయగా, ప్రస్తుతం వాటి ఊసే లేకుండా పోయింది. ఎస్సీలకు ప్రత్యేక పథకం కింద పాడిగేదెలు అందజేయగా నేడు మంజూరు చేసే పరిస్థితి లేకుండా పోయింది. ఎస్సీలకు పాడి పశువులకు పంపిణీ చేసేందుకు 150 యూనిట్లు మంజూరు కాగా, అవి ఇప్పటివరకు మంజూరు కాలేదు. వ్యవసాయరంగం అభివృద్ధి సాధించాలంటే పశుగుణావృద్ధి ఎంతో అవసరం ఉండగా, వాటిని పట్టించుకునే పరిస్థితులు లేకపోవడంతో పశువుల సంఖ్య రోజురోజూకు తగ్గుతోంది. ఈ పరిస్థితి ఇలానే ఉంటే గ్రామీణప్రాంతాల్లో పశువుల అభివృద్ధి, పశువుల పెంపకం అభివృద్ధిపై రైతుల ఆశలు సన్నగిల్లే పరిస్థితి ఉంది. ప్రభుత్వం పశువులకు ఉచితక్యాంపు నిర్వహించాలని పాడి రైతులు కోరుతున్నారు.

● సంవత్సరానికి రెండుసార్లు మందుల సరఫరా..

- డాక్టర్ అనిల్, పశువైద్యాధికారి, రామడుగు



సంవత్సరానికి నాలుగుసార్లు రావాల్సిన మందులు రెండు సార్లు వస్తున్నాయి. ప్రభుత్వం అందించే మందులతో పశువులకు ఇబ్బందులు లేకుండా వైద్యసేవలు అందిస్తున్నాం. గొర్రె,మేకల నట్టల నివారణ మందులు లేకపోవడంతో ఆ కార్యక్రమాన్ని నిర్వహించడం లేదు.

బస్తీవాసుల అండతో.. ఒక్కటైన దివ్యాంగ జంట


బస్తీవాసుల సమక్షంలో వివాహం చేసుకుంటున్న దివ్యాంగులు

బెల్లంపల్లి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): వాళ్లిద్దరూ దివ్యాంగులు. ఒకరికి పుట్టుకతోనే అంధత్వం, మరొకరికి చిన్నతనంలోనే పోలియో. వారిని వివాహం చేసుకోవడానికి ఎవరు ముందుకు రాలేదు. దీంతో బస్తీవాసులందరు పెద్దమనసు చేసుకుని ముందుకు వచ్చి వివాహం జరిపించారు. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలోని బూడిదగడ్డ బస్తీకి చెందిన తమ్మిడి భాగ్యమ్మ, సత్తయ్య కూతురు ప్రేమలత చిన్నప్పటి నుంచి పోలియోతో రెండు కాళ్లు చచ్చుబడి నడవలేకుండా ఉంది. పెద్దపల్లి జిల్లా ఆదివారంపేట మండలానికి చెందిన కస్తూరి రాయమల్లమ్మ, ఓదెలు రెండవ కుమారుడు రమేశ్ పుట్టుకతోనే అంధుడు. ఇద్దరు దివ్యాంగులు కావడంతో ఇద్దరికి వివాహం కావడం లేదు. ఈ క్రమంలో బూడిదగడ్డ బస్తీకి చెందిన బస్తీవాసులు వీరిద్దరికి వివాహం చేయాలని నిశ్చయించారు. ఆ ఇద్దరి అభిప్రాయాన్ని తీసుకున్నారు. నిరుపేదలు కావడంతో బస్తీవాసులే పెళ్లికి కావాల్సిన ఖర్చులు భరించారు. అన్నీ తామై బెల్లంపల్లి పట్టణంలోని శివాలయంలో ఆదివారం ఘనంగా వివాహం జరిపించారు. పుస్తెల నుంచి భోజనం వరకు అయ్యే ఖర్చు నంతా తలో చేయి వేసి బాగస్వాములు వివాహం జరిపించారు.

రేణుకాదేవి ఆలయంలో చోరీ

ఇల్లంతకుంట, మార్చి 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని రేపాక గ్రామంలోని రేణుకఎల్లమ్మ దేవి ఆలయంలో చోరీజరిగింది. ఆలయానికి వేసిన తాళాలను పగులగొట్టి దొంగలు హుండీని ఎత్తుకెళ్లారు. సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించి కేసులు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అగ్నిపథ్-2025 ఉద్యోగాలకు
దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్ స్పోర్ట్స్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): ఇండియన్ ఆర్మీలో అగ్నిపథ్ 2025-26 సంవత్సరానికి అగ్నివీర్‌ల నియామకాలకు అవివాహిత యువకుల నుంచి భారత సైన్యం దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఈ ఏడాది ఏప్రిల్ 10లోగా అభ్యర్థులు దరఖాస్తులను ఆన్‌లైన్‌లో సమర్పించాలి. ఆన్‌లైన్ పరీక్ష జూన్‌లో నిర్వహించనున్నారు. అగ్నివీర్ జనరల్, అగ్నివీర్ టెక్నికల్, అగ్నివీర్ క్లర్క్/స్టోర్ కీపర్, టెక్నికల్ ట్రేడ్‌మెన్(10వ తరగతి పాస్), అగ్నివీర్ ట్రేడ్‌మెన్(8వ తరగతిపాస్), కేటగిరీల్లో అభ్యర్థుల ఎంపిక ఉంటుంది. అభ్యర్థులు అర్హత ఆధారంగా ఏవైన రెండు కేటగిరీలకు మాత్రమే దరఖాస్తు చేసుకోవచ్చు. మరిన్ని వివరాలకు ఇండియన్ ఆర్మీ వెబ్‌సైట్‌లోగానీ, సికింద్రాబాద్‌లోని ఆర్మీ రిక్రూట్‌మెంట్ కార్యాలయం, 040 27740059 నంబరులోగానీ సంప్రదించవచ్చు.

నేడు శ్రీభాష్యం విజయసారథి రాష్ట్రీయ సంస్కృత
పురస్కారం ప్రదానం

కరీంనగర్ కల్చరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): శ్రీభాష్యం విజయసారథి రాష్ట్రీయ సంస్కృత పురస్కారాన్ని సోమవారం సంస్కృత అకాడమి, సర్వ వైదిక సంస్థానం ట్రస్టు సంయుక్త నిర్వహణలో హైదరాబాద్‌లోని సంస్కృత అకాడమిలో ప్రదానం చేయనున్నట్లు సంస్థానం మేనేజింగ్ ట్రస్టీ శ్రీభాష్యం వరప్రసాద్ తెలిపారు. ఏటా జాతీయ స్థాయిలో ఒక సంస్కృత పండితుడికి పురస్కారం అందజేస్తున్నట్లు, ఈ ఏడాది ఒరిస్సాకు చెందిన ఆచార్య హరేకృష్ణ శతపతి ఎంపికైనట్లు పేర్కొన్నారు. హరేకృష్ణ ప్రస్తుతం కేంద్ర సాహిత్య అకాడమి సంస్కృత భాషా సలహా మండలి కన్వీనర్‌గా వ్యవహరిస్తున్నట్లు తెలిపారు.

వృద్ధులు చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలి

సీనియర్ సిటిజన్స్ రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్ కుమార్

కోరుట్ల రూరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): వృద్ధులు చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని సీనియర్ సిటిజన్స్ రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్ కుమార్ అన్నారు. ఆధివారం మండలంలోని కల్లూర్ గ్రామ శివారులోని శివసాయి ఫంక్షన్ హాల్‌లో వయోవృద్ధుల చట్టాలపై అవగాహన కల్పించారు. కోరుట్ల డివిజన్ సీనియర్ సిటీజన్స్, పెన్షనర్ అసోసియేషన్ సంఘ అధ్యక్షుడు పబ్బాశివానందం జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా పబ్బా శివానందను సత్కరించారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ సభ్యులు హన్మంతరెడ్డి, గంటేడి రాజ్‌మోహన్, చిలుక గంగారాం, రాజేశ్వర్,సాబితలి, లక్ష్మినారాయణ, రాజయ్య, చిన్న మల్కయ్య, మాజీ సర్పంచ్ వనతడుపుల అంజయ్యలతో పాటు పలువురు పాల్గొన్నారు.

- ఉమ్మడి జిల్లాలో పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- ప్రజలను అప్రమత్తం చేస్తున్న వైద్య ఆరోగ్య శాఖ



వడదెబ్బతో జర జాగ్రత్త

జగిత్యాల, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. జగిత్యాల జిల్లా వ్యాప్తంగా 38డిగ్రీల నుంచి 42 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదు కావడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. ఈ వేసవి సీజన్‌లో సాధారణ ఉష్ణోగ్రతల కంటే దాదాపు మూడు నుంచి ఆరు డిగ్రీల వరకూ అధికంగా నమోదు అవుతున్నట్లు వాతావరణ శాఖ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. దీంతో వృద్ధులు, చిన్నారులు, మహిళలు ఎక్కువగా వడదెబ్బకు గుర య్యే అవకాశాలున్నాయి. జిల్లాలో వారం రోజులుగా ఎండ వేడిమి తీవ్రత ఎక్కువైంది. ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారులు విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. వడదెబ్బకు గుర య్యే కారణాలు, వడ దెబ్బ లక్షణాలు, నివారణకు తీసుకోవాల్సిన చర్యలు, ముందస్తు జాగ్రత్తలను జగి త్యాల జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆద్వర్యంలో వైద్యాధి కారులు, ఆరోగ్య సిబ్బంది విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు.



ఎండలో బయటకు వెళ్లవద్దని సూచిస్తున్న వైద్య అధికారులు, సిబ్బంది

● వడదెబ్బ లక్షణాలు..

శరీరంలో నీటి శాతం లోపిస్తుంది. శరీర ఉష్ణోగ్రత బాగా పెరుగుతుంది. వడదెబ్బ ప్రభావం ఎక్కువగా ఉంటే వాంతులు, విరేచనాలు ఏర్పడతాయి. దాహం ఎక్కువగా ఉంటుంది. తల తిరగడం, మతి కోల్పో వడం వంటి లక్షణాలు కనిపి స్తాయి. గుండె లయ తప్పుతుంది. ఈ పరిస్థితిని తట్టుకోలేకపోతే మరణాలు కూడా సంభవిస్తాయని వైద్యులు అంటున్నారు.

● పాటించాల్సిన జాగ్రత్తలు..

వడదెబ్బకు గురయినప్పుడు శరీరాన్ని వేగంగా చల్లబరిచే ప్రయత్నం చేయాలి. వడదెబ్బ తగిలిన వ్యక్తిని చల్లని ప్రదేశంలోకి తీసుకెళ్లాలి. దుస్తులను వదులుగా చేసి తడి గుడ్డతో ఒళ్లంతా తుడవాలి. రోగికి తగినంత గాలి ఆడేటట్లు చేయాలి. రోజుకు ఐదు, ఆరు లీటర్లకు తగ్గకుండా నీరు తాగాలి. ఉప్పు కలిపిన ద్రవాలు లేదా ఓఆర్ఎస్ ద్రావణం త్రాగాలి. కాటన్ దుస్తులను ధరించాలి. నూనె పదార్థాల వాడకం తగ్గించాలి. కొబ్బరి బోండాం, మజ్జిగ తాగడం మంచింది. సలాడ్స్, తాజా కాయగూరలు, ఫ్రూట్ జ్యూస్‌లు తీసుకోవడం మంచింది. వడదెబ్బ తగలకుండా ఉండాలంటే ఎండలో బయటకు వెళ్లేటప్పుడు తలకు క్యాప్ పెట్టుకోవాలి. బయటకు వెళ్లేటప్పుడు తప్పకుండా కూలింగ్ అద్దాలు పెట్టుకోవాలి.

ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి

-డాక్టర్ ప్రమోద్ కుమార్, జిల్లా వైద్యాధికారి, జగిత్యాల



వడదెబ్బ తగలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో ప్రతినిత్యం వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటున్నారు. వడదెబ్బ తగిలిన వారిని గుర్తించిన వారు వెంటనే 108కు సమాచారం అందించాలి. అంగన్‌వాడీ కేంద్రాల్లో, ఉపాధిహామీ పని ప్రాంతాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుతున్నాం. అవసరమున్న వారు సంబంధిత సమీప కేంద్రాల్లో ఉచితంగా పొందవచ్చు.

అర్బన్ బ్యాంకు సభ్యులకు
రెండు లక్షల బీమా

- కరీంనగర్ సహకార అర్బన్ బ్యాంకు పీఐసీ చైర్మన్ గడ్డం విలాస్‌రెడ్డి



మాట్లాడుతున్న బ్యాంకు పీఐసీ చైర్మన్ గడ్డం విలాస్‌రెడ్డి

కరీంనగర్‌టౌన్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): బ్యాంకుసభ్యులు, ఖాతాదరులు, వినియోగదారుల సహకారంతో ది కరీంనగర్ సహకార అర్బన్ బ్యాంకు లాభాలతో ముందుకెళ్తోంది. బ్యాంకు అభివృద్ధికి సలహాలు, సూచనలందిస్తూ సహకరిస్తున్న బ్యాంకు సభ్యులకు రెండు లక్షల రూపాయల బీమా సౌకర్యాన్ని వర్తింపజేస్తామని బ్యాంకు పీఐసీ చైర్మన్ గడ్డం విలాస్‌రెడ్డి ప్రకటించారు. ఆదివారం నగరంలోని రెవెన్యూ గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన అర్బన్ బ్యాంకు మహాజన సభలో మాట్లాడారు. బ్యాంకింగ్ రంగంలో నెలకొన్న పోటీని తట్టుకునే విధంగా బ్యాంకు కార్యకలాపాలను విస్తరించాల్సిన అవసరముంద న్నారు. త్వరలోనే హుస్నాబాద్, చొప్పదండిలో కొత్తగా బ్రాంచీలను ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. బ్యాంకుకు మూల స్తంభాలైన సభ్యులకు రెండు సంవత్సరాల డివిడెండ్‌ను ఏప్రిల్ నుంచి నగదు రూపంలో అందజేస్తామన్నారు. కరీంనగర్ ప్రధాన కేంద్రంగా పనిచేస్తున్న ఈ బ్యాంకుకు జగిత్యాలలో ఒక బ్రాంచి ఉందని, ఇటీవల గంగాధరలోనూ కొత్తగా బ్రాంచ్ ఏర్పాటు చేశామని తెలిపారు. బ్యాంకులో డిపాజిట్లను పెంచుకోవడంతోపాటు రుణాల మంజూరు, రికవరీపై దృష్టిసారిస్తున్నట్లు చెప్పారు. బ్యాంకును మరింత అభివృద్ధి బాటలో నడిపించేందుకు పాలకవర్గం, ఉద్యోగులు, సిబ్బంది సహకారంతో కృషి చేస్తామన్నారు. బ్యాంకులో మార్టిగేజ్ రుణాలను రూ.20 లక్షలకు పెంచడంతోపాటు బంగారు ఆభరణాలను తాకట్టుపెట్టుకొని ఇచ్చే రుణాలను కూడా మార్కెట్ రేట్లకు అనుగుణంగా సవరిస్తామన్నారు. కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోకి కొత్తపల్లి మున్సిపాలిటీతోపాటు శివారు గ్రామాలను విలీనం చేస్తూ నగర పరిధిని విస్తరించినందున బ్యాంకు సేవలను కూడా 20 కిలో మీటర్ల పరిధిలోకి విస్తరిస్తామన్నారు. సమావేశంలో పాలకవర్గ సభ్యులు మడుపు మోహన్, ముక్క భాస్కర్, బొమ్మరాతి సాయికృష్ణ, ముద్దసాని క్రాంతి, రేగొండ సందీప్, మూల లక్ష్మీరవీందర్‌రెడ్డి, విద్యాసాగర్, లక్ష్మణ్‌రాజు, మహ్మద్ సమీయుద్దీన్, మంగి రవీందర్, నాగుల సతీష్, మార్క రాజు, గంజి అంజయ్య, బ్యాంకు సీఈవో నునుగొండ శ్రీనివాస్, ఎలుక సుధాకర్, సభ్యులు ముప్పిడి సునీల్, ఆది మల్లేశం, కల్యాడపు ఆగయ్య, రాంచంద్రం పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి

సుభాష్‌నగర్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి మాదిగలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి అనిల్ అన్నారు. కలెక్టరేట్ ఎదుట చేపట్టిన దీక్ష శిబిరంలో ఆదివారం మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణను ప్రతీ ఉద్యోగ నోటిఫికేషన్ వర్తింపజేస్తామని అసెంబ్లీలో హామీ ఇచ్చినట్లు తెలిపారు. వర్గీకరణ కోసం ఈనెల 17న అసెంబ్లీలో చట్టం చేస్తామని చెబుతూనే మరోవైపు ఉద్యోగాల పరీక్షల ఫలితాలు విడుదల చేస్తున్నారని, ద్వంద వైఖరి అవలంబిస్తున్నారని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాటలకు చేతలకు పొంతనలేకుండా పోయిందన్నారు. ఎస్సీ రిజర్వ్‌డ్ ఉద్యోగాలన్నీ మాల సామాజిక వర్గానికి దోచిపెట్టడానికే రేవంత్‌రెడ్డి కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. ఇచ్చిన మాటకు కట్టుబడి వెంటనే చట్టం చేసి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ అమల్లోకి వచ్చే వరకు పోరాటం ఆగదన్నారు. ఈ దీక్షలో కనకం అంజిబాబు, వరలక్ష్మి, కొత్తూరి రాజయ్య, శెనిగరపు హన్మయ్య, రేపాక బాబు, అలవాల సంపత్, గాలి మొగిలి, నక్క లక్ష్మణ్, గుడిసె విజయ్, గంగాధర రఘు, తడగొండ రమేశ్, కోడూరి మహేశ్, గాలిపెల్లి కొమురయ్య, భూత్కూరి యాకోబు, బోయినిపల్లి చంద్రయ్య, మ్యాక రాజు, పులిపాక కిషన్, వేల్పుల చిలుకమ్మ, గాలి బుచ్చమ్మ, బి.రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులు దేశం గర్వపడేలా రాణించాలి

● రాష్ట్ర స్థాయి హాకీ పోటీలు ప్రారంభం ● ఉమ్మడి 10 జిల్లాల నుంచి క్రీడాకారులు రాక ● హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి



హాకీ టోర్నమెంట్‌లో తలపడుతున్న కరీంనగర్-రంగారెడ్డి జట్లు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి, వొడితెల ప్రణవ్

హుజూరాబాద్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): హాకీ క్రీడకారులు దేశం గర్వపడేలా రాణించాలని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. ఆదివారం హుజూరాబాద్‌లోని హైస్కూల్ మైదానంలో రాష్ట్రస్థాయి హాకీ మెన్ క్రీడాపోటీలను ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీ వొడితెల ప్రణవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి మాట్లాడుతూ హుజూరాబాద్ హాకీక్రీడాకారులు 30 ఏళ్లుగా జాతీయ, రాష్ట్రస్థాయిల్లో ఉత్తమప్రతిభ కనబరుస్తున్నారన్నారు. క్రీడలతో మానసికోల్లాసం, శారీర దారుఢ్యం పెరుగుతుందన్నారు. క్రీడలు స్నేహాభావాన్ని పెంపొందిస్తా యన్నారు. క్రీడాకారుల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం మినీస్టేడియం నిర్మించాలని డిమాండ్ చేశారు. అనంతరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీఇన్‌చార్జీ వొడితెల ప్రణవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడలకు అధికప్రాధాన్యత ఇస్తుందన్నారు. కార్య క్రమంలో కరీంనగర్ మాజీమేయర్ సర్దార్ రవీందర్ సింగ్, జిల్లాఅసోసియేషన్ సెక్రెటరీ సర్దార్ సురేందర్‌సింగ్, సర్దార్‌కళ్యాణ్‌సింగ్, బి శ్రీనివాస్, రాధిక, శ్రీనివాస్, తోటరాజేంద్ర ప్రసాద్, సమ్మయ్య, రవీందర్, బాలరాజు, సాయికృష్ణ, రమేష్, శ్యాంసుందర్, ప్రభాకర్, రాజేష్, వినయ్, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

● క్రీడా పోటీల వివరాలు..

జరుగుతున్న రాష్ట్రస్థాయి హాకీ పోటీల్లో గ్రూప్-ఏలో రంగారెడ్డిపై కరీంనగర్ జట్టు7-1, ఖమ్మంపై హైదరాబాద్ 10-0, రంగారెడ్డిపై వరంగల్ 6-1, ఖమ్మంపై కరీంనగర్ 6-2, హైదరాబాద్‌పై వరంగల్‌జట్టు 3-2తో విజయం సాధించాయి. గ్రూప్-బిలో నల్గొండపై ఆదిలాబాద్8-0, నిజామాబాద్‌పై మెదక్6-1, మహబూబ్‌నగర్‌పై ఆదిలాబాద్ జట్టుతలపడగా డ్రాగా ముగిసింది. నల్గొండపై మెదక్ 11-0, మహబూబ్‌నగర్‌పై నిజామాబాద్ 3-2తో విజయం సాధించాయి. ప్రతిమ్యాచ్‌లో మ్యాన్‌ఆఫ్‌ది మ్యాచ్ అందించారు.

ఘనంగా వేంకటేశ్వర స్వామి డోలోత్సవం



ధర్మపురి బ్రహ్మపుష్కరిణిలో వేంకటేశ్వరుడి డోలోత్సవం

ధర్మపురి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం వేంకటేశ్వర స్వామి తెప్పోత్సవం, డోలోత్సవం ఘనంగా జరిగింది. ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్ శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్చరణల మధ్య స్వామి వారల ఉత్సవమూర్తిని సేవలపై ఆశీనులు చేశారు. అనంతరం పురవీధుల గుండా బ్రహ్మ పుష్కరిణి (కోనేరు)కు తీసుకువచ్చారు. బ్రహ్మ పుష్కరిణి నీటిలో హంస వాహన రూపంలో గల నూతన పడవ పైన ఉంచిన స్వామి వారల సేవలను ఐదుసార్లు ప్రదక్షిణాలు చేయించి అర్చకులు తెప్పోత్సవం జరిపారు. అనంతరం బ్రహ్మ పుష్కరిణి మధ్య గల మండపంలోని ఊయలపై ఆశీనులు చేసి అర్చకులు సనాతన సాంప్రదాయ రీతిలో డోలోత్సవం జరిపారు. ఆలయ ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్య ఆధ్వర్యంలో ఉత్సవ కార్యక్రమాన్ని కొనసాగించారు. ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ధర్మకర్తల మండలి సభ్యులు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. ధర్మపురి సీఐ రాంనర్సింహరెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐ ఉదయ్‌కుమార్, శ్రీధర్, ఉమాసాగర్, సతీష్, దత్తాత్రి, కుమారస్వామి, పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

● ఆరో రోజు రూ.6.58 లక్షల ఆదాయం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయానికి ఆరో రోజు రూ.6,58,000 ఆదాయం లభించినట్లు ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ తెలిపారు. ఇందు లో వివిధ రకాల పూజల టిక్కెట్లు విక్ర యించగా రూ.2,95,223, ప్రసాదాలు విక్రయిం చగా రూ.2,96,525 లభించాయి. అన్నదానం కోసం భక్తులు సమర్పించిన విరాళాలు రూ. 66,252 ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు.

● లక్ష్మీ నృసింహస్వామి దక్షిణ దిగ్యాత్ర

లక్ష్మీ నృసింహస్వామి దక్షిణ దిగ్యాత్ర కార్యక్రమాన్ని సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా కల్యాణం, తెప్ప, డోలోత్సవాల అనంతరం స్వామి వారలు దక్షిణం వైపు విహార యాత్రకు బయలుదేరే కార్యక్రమాన్ని దక్షిణ దిగ్యాత్రగా చెబుతుంటారు. ఈ దిగ్యాత్రలో భాగంగా శ్రీ లక్ష్మీ నృసింహస్వామి (యోగ, ఉగ్ర) వారల ఉత్సవ మూర్తులను ఆలయం నుంచి బయటకు తీసుకు వచ్చారు. అనంతరం సేవలపై ఉంచి మంగళ వాయిద్యాలు వెంట రాగా దక్షిణ దిశలో గల పోలీస్ స్టేషన్ వైపు తీసుకువెళ్లారు. జగిత్యాల డీఎస్పీ రఘుచందర్, ధర్మపురి సీఐ రాంనర్సింహరెడ్డి, ఎస్ఐలు ఉదయ్‌కుమార్, శ్రీధర్‌రెడ్డి, సతీష్, ఉమాసాగర్ స్వామి వారల సేవలను ఎత్తుకుని లోనికి ప్రవేశించారు. జగిత్యాల డీఎస్పీ, ధర్మపురి సీఐ, ఎస్ఐల దంపతులు ప్రత్యేకంగా పూజల్లో పాల్గొని స్వామి వారలను దర్శనం చేసుకున్నారు.



పోలీస్ స్టేషన్ ఆవరణలో స్వామి వారలకు పూజలు నిర్వహిస్తున్న పోలీసు అధికారులు

● బ్రహ్మోత్సవాల్లో నేడు

బ్రహ్మోత్సవాల్లో సోమవారం సాయంత్రం 4 గంటలకు శ్రీ లక్ష్మీ నృసింహస్వామి ఉత్తర దిగ్యాత్ర, రాత్రి 8 గంటలకు భోగ మండపం, 9 గంటలకు వేదసదస్సు ఉత్సవం ఉంటుంది. శేషప్ప కళావేదికపై రాత్రి వేళలో 7 గంటల నుండి సంగీత విద్యాంసులు కొరిడె నరహరి, జ్యోతిచే శాస్త్రీయ సంగీతం, రాత్రి 9 గంటలకు వేదసదస్సు, భోగమండప ఉత్సవం కార్యక్రమాలు ఉంటాయని ఆలయ ఈవో తెలిపారు.

కన్నుల పండువగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

రామడుగు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపాల్‌రావుపేటలో ఆదివారం వేంకటేశ్వర స్వామి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించిన కల్యాణం వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య వందలాది మంది గ్రామస్థుల సమక్షంలో కన్నుల పండువగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లిసత్యం హాజరై ప్రత్యేకపూజలు నిర్వహించారు.



కల్యాణోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

వైభవంగా పెద్దాపూర్ మల్లన్న బోనాలు

- హాజరైన 70వేల మంది భక్తులు
- పూజలు నిర్వహించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



ఆలయంలోని ఉత్సవమూర్తులు

పెద్దాపూర్‌లోని మల్లన్నస్వామి ఆలయం చుట్టూ బోనాలతో ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

మెట్‌పల్లి రూరల్, మార్చి, 16 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం పెద్దాపూర్ గ్రామంలోని మల్లన్న స్వామి పుణ్య క్షేత్రంలో బోనాల జాతర ఆదివారం వైభవంగా జరిగింది. ప్రతి ఏటా హోలీ తరువాత వచ్చే మొదటి ఆదివారం గ్రామంలో మల్లన్న జాతర ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. ఉదయం నుంచి స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, పూజలను ఆలయం ప్రధాన పురోహితుడు ఆసరి మహేష్ నిర్వహించారు. జాతరకు జగిత్యాల, కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాలతో పాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, కర్ణాటక రాష్ట్రాల నుంచి 70 వేల మంది భక్తులు పాల్గొన్నారు. సాయంత్రం మహిళలు, భక్తులు ఉపవాస దీక్షలతో బోనం కుండలను అలంకరించి నైవేద్యాన్ని తయారు చేశారు. బోనాలను భక్తులు నెత్తిన ఎత్తుకొని శివసత్తుల పూనకాలు, ఒగ్గు కళాకారుల నృత్యాలతో డప్పుచప్పుళ్ల మధ్య ఆలయానికి ఊరేగింపుగా వచ్చారు. అనంతరం ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి స్వామి వారికి బోనం సమర్పించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మిట్టపల్లి నారాయణరెడ్డి, అధికారులు ఏర్పాట్లు చేశారు. అనంతరం నిర్వాహకులు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రథంలో ఉత్సవమూర్తులను ఆలయ ప్రధాన పురోహితుడు మల్లేష్‌యాదవ్ పట్టుకుని ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రథంపై కూర్చొన్నారు. అనంతరం ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేయించి జాతరను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, మాజీ జడ్పీటీసీ కాటిపెల్లి రాధశ్రీ-శ్రీనివాస్ రెడ్డిలు స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగ కుండా మెట్‌పల్లి డీఎస్పీ రాములు పర్యవేక్షణలో సీఐలు నిరంజన్‌రెడ్డి, సురేష్ ఆధ్వర్యంలో ఎసైలు కిరణ్‌గౌడ్, శ్రీకాంత్, శ్యామ్‌రాజ్, నవీన్ బందోబస్తు చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మారు సాయిరెడ్డి, మాజీ సర్పంచు కోరెపు రవి, వైస్ చైర్మన్లు కచ్చు శ్రీనివాస్, పిల్లి పెద్దమల్లేష్‌యాదవ్, మేర్గు రమేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



నృత్యాలతో ప్రదక్షిణలు చేస్తున్న శివసత్తులు, ఒగ్గుకళాకారులు

వ్యవసాయంలో మెళకువలు పాటిస్తేనే అధిక దిగుబడులు

- సందీప్, వ్యవసాయ అధికారి





ఆంధ్రజ్యోతి: అధిక దిగుబడులు సాధించేందుకు రైతులకు ఎలాంటి సూచనలు ఇస్తున్నారు?

వ్యవసాయ అధికారి : రైతులను చైతన్యవంతం చేసేందుకు సమావేశాలను ఏర్పాటు చేసి వ్యవసాయ నూతన పద్ధతులపై అవగాహన కల్పిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: యాసంగిలో రైతులు ఏయే పంటలు వేస్తున్నారు?

వ్యవసాయ అధికారి: వరి, మొక్కజొన్న, నువ్వులు, శనిగలు, పెసరు పంటలను రైతులు సాగు చేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి : మండలంలో ఎన్ని ఎకరాల్లో ఏయే పంటలు వేస్తున్నారు?

వ్యవసాయ అధికారి: ఈ సంవత్సరం యాసంగిలో వరి 17,700 ఎకరాల్లో, మొక్కజొన్న 5 ఎకరాలు, నువ్వులు 10 ఎకరాలు, పెసరు 10 ఎకరాలు, శనిగలు మూడు ఎకరాల్లో సాగు చేస్తున్నారు.

- కోనరావుపేట (ఆంధ్రజ్యోతి)

నియోజక వర్గ సమస్యలపై ధర్నాచౌక్ వద్ద నిరహార దీక్ష

గంభీరావుపేట, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : రాజన్న సిరిసిల్ల నియోజకవర్గ సమస్యలపై హైదరాబాద్ ధర్నాచౌక్ వద్ద నిరాహార దీక్ష చేస్తానని శివసేన జిల్లా ఇన్‌చార్జీ గౌటే గణేష్ వెల్లడించారు. గంభీరావుపేటలో ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ నియోజక వర్గంలో సమస్యలు తిష్టవేశాయన్నారు. పాత తాలుకాగా వెలుగొందిన గంభీరావుపేట అభివృద్ధికి ఆమడ దూరంలో ఉండటానికి పాలకుల నిర్లక్ష్యమే కారణమన్నారు. సిద్దిపేట-కామారెడ్డి ప్రధాన రహదారిలో ఉన్న మానేరు వాగు బ్రిడ్జి అందుకు అద్దం పడుతోందన్నారు. ప్రభుత్వాలు మారుతున్న బ్రిడ్జి పనుల్లో చలనం లేకపోవడం ఎవరి నిర్లక్ష్యమో ప్రజలకు అర్థం అవుతోందన్నారు. ప్రజలకు కనీస వసతులు కల్పించడంలో గత, ప్రస్తుతం ప్రభుత్వం పూర్తిగా విఫలమయ్యాయని వెల్లడించారు.

ప్రజా ఆరోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట..

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్


నిజామాబాద్‌లో సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులతో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

కోనరావుపేట, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : ప్రజా ఆరోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. కోనరావుపేట మండలం నిజామాబాద్ గ్రామంలోని రైతు వేదికలో కోనరావుపేట మండల పరిధిలో పలువురుకి మంజూరు అయిన 8లక్షల 38 వేల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను 27 మంది లబ్ధిదారులకు స్థానిక నాయకులతో కలసి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా ఆరోగ్యానికి పెద్దపీట వేస్తుందని, ఇందులో భాగంగా రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితి 10లక్షలకు పెంచడం జరిగిందని తెలిపారు. ప్రజా ప్రభుత్వంలో అన్ని వర్గాల వారికి సమన్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు కేతి రెడ్డి జగన్మోహన్‌రెడ్డి, కోనరావుపేట మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య, వైస్‌చైర్మన్ తాళ్లపల్లి ప్రభాకర్, కాం గ్రెస్ మండల అధ్యక్షుడు ఫిరోజ్ పాషా, కాంగ్రెస్ నాయకులు బాల్‌రెడ్డి, నీరటి సంజీవ్, ఉప్పుల గంగ య్య, నరసింహ చారి, వెంగలి వెంకన్న, నందు గౌడ్, పల్లె మంజుల, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

● చందుర్తి : చందుర్తి మండల కేంద్రంలోని రైతు వేదికలో పలువురుకి మంజూరైన 9 లక్షల 61 వేల విలువగల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను 24 మంది లబ్ధిదారులకు ఆదివారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ లబ్ధిదారులకు అందజేశారు. ఏఎంసీ చైర్మన్ చెలకల తిరుపతి, మాజీ జడ్పీటిసి సభ్యులు నాగం కుమార్, నాయకులు రామస్వామి, మల్లేశం, మధు, ప్రసాద్, ప్రభాకర్, సత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

● రుద్రంగి : మండల కేంద్రంలోని గ్రామ పంచాయితీ అవరణంలో పలువురుకి మంజూరైన 3 లక్షల 74వేల విలువగల 12 సీఎం ఆర్ఎఫ్ చెక్కులను స్థానిక నాయకులతో కలసి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ లబ్ధిదారులకు అందజేశారు. మార్కెట్ కమిటీ చైర్మన్ చెలుకల తిరుపతి, తర్రె మనోహర్, ఎర్రం గంగ నరసయ్య, గడ్డం శ్రీనివాస్ రెడ్డి, గండి నారాయణ, మాడిశెట్టి అభిలాష్, తర్రె లింగం, ఎర్రం రాజలింగం, సిరికొండ రవి, సూర యాదయ్య పాల్గొన్నారు.

రైతులు ఆగ్రహిస్తే ప్రభుత్వాలే కూలిపోతాయి


రైతులను ఉద్దేశించి మాట్లాడుతున్న జాన్ వెస్లీ

ఇల్లంత కుంట, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : రైతుల ఆగ్రహానికి గురైతే ప్రభుత్వాలే కూలిపోతాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ పేర్కొన్నారు. మండలంలోని పెద్దలింగాపూర్ గ్రామసమీపంలో ఇల్లంతకుంట, తంగళ్ళపల్లి మండలాలకు చెందిన రైతులు చేపట్టిన నిరసన దీక్ష ఆదివారానికి 14వరోజుకు చేరుగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శి సంఘీభావం ప్రకటించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్న ప్రభుత్వానికి కాలువ నిర్మాణానికి నిధులు మంజూరు ఎందుకు చేయడంలేదని ప్రశ్నించారు. సాగునీటి కోసం మహిళా రైతులు నిరసన చేపట్టారంటే ప్రభుత్వ పరిస్థితిని అర్థం చేసుకోవచ్చన్నారు. ప్రభుత్వ వైఖరి మారకుంటే రాబోవు రోజుల్లో ఉద్యమాలు నిర్మిస్తామన్నారు.సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు స్కైలాబ్‌బాబు, జిల్లా కార్యవర్గ సభ్యుడు గన్నారం నర్సయ్యలతో పాటు వివిద గ్రామాల నాయకులు, రైతులు పాల్గొన్నారు.

డీలిమిటేషన్ పేరుతో అన్యాయం..

డీలిమిటేషన్ పేరుతో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేయాలని కేంద్ర ప్రభుత్వం చూస్తోందని జాన్‌వెస్లీ పేర్కొన్నారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగానికి వ్యతిరేకంగా ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్‌పరం చేస్తోందన్నారు. హామీలు ఇచ్చి రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఏఒక్క హామీని పూర్తిస్థాయిలో నెరవేర్చలేదన్నారు. కులగణన దేశవ్యాప్తంగా చేపట్టాలని డిమాండ్ చేశారు.

సవాళ్లు.. ప్రతి సవాళ్లు..

సిరిసిల్ల టౌన్, మార్చి 16, (ఆంధ్రజ్యోతి) : రాజన్న సిరిసిల్ల జిల్లాలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీ నాయకుల మధ్య కొన్ని రోజులుగా సవాళ్ళు ప్రతి సవాళ్ళు చేసుకున్నారు. గత సర్పంచ్ ఎన్నికలలో జిల్లెళ్ళ సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మాట్ల మాధుకు గెలుపు కోసం పొన్నం ప్రభాకర్ రూ.40వేలు ఇచ్చాడని అది నిరూపిస్తామని కాంగ్రెస్, తీసుకోలేదు నిరూపించాలని బీఆర్ఎస్ నాయకుల మధ్య పాత్రికేయుల సమావేశాలలో ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకొని సవాళ్లకు ప్రతి సవాళ్ళు చేసుకున్నారు. ఈనెల 16 ఆదివారం అంబేద్కర్ చౌరస్తా వద్దకు ఆధారలతో వస్తామని దమ్ముంటే బీఆర్ఎస్ నాయకులు రావాలని కాంగ్రెస్ నాయకుల సవాల్‌ను విసిరారు. ఆదివారం ఉదయం సిరిసిల్ల అంబేద్కర్ చౌరస్తా వద్దకు కాంగ్రెస్ నాయకులు చేరుకొని రోడ్డుపై బైటాయించారు. కాంగ్రెస్ పార్టీ నాయకుల సవాల్‌ను స్వీకరించిన బీఆర్ఎస్ నాయకులు అంబేద్కర్ చౌరస్తాకు రాగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో రెండు వర్గాల మధ్య తోపులాటలు జరగడంతో అక్కడ ఉద్రిక్తత చోటు చేసుకుంది. పోలీసులు అప్రమత్తమై బీఆర్ఎస్ నాయకులను అరెస్టు చేసి పోలీ స్టేషన్‌కు తరలించారు. కాంగ్రెస్ నాయకులు రోడ్డుపై బైఠాయించి నిరసనలు తెలిపి వెళ్లిపోయారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో బీఆర్ఎస్ నాయకుల గజభీంకార్ రాజన్న, బొల్లి రామ్మోహన్, పడిగెల రాజు, కోడి అంతయ్య తదితరులు ఉన్నారు.

అంతకు ముందు ముందస్తుగా మాజీ సర్పంచ్ మాట్ల మధు, కాంగ్రెస్ పార్టీ తంగళ్ళపల్లి మండల అధ్యక్షుడు జలగం ప్రవీన్‌ను అరెస్టు చేసి పోలీస్టేషన్‌కు తరలించారు.

కార్పొరేట్ వల..

(5వ పేజీ తరువాయి)

26న మ్యాథ్స్, 28న సైన్స్(ఫిజికల్‌సైన్స్) 29న సైన్స్(బయోలాజికల్‌సైన్స్), ఏప్రిల్ 2న సోషల్ స్టడీస్ పరీక్ష నిర్వహించనున్నారు. ఇందుకు ఏర్పాట్లుచేస్తున్నారు.

● జిల్లాలో మెరుగైన ఫలితాలు..

రాజన్న సిరిసిల్ల జిల్లాలో పది వార్షిక పరీక్షల్లో విద్యార్థులు మెరుగైన ఫలితాలే సాధిస్తున్నారు. గత విద్యా సంవత్సరం 6,470 మంది పరీక్షలకు హాజరుకాగా, 6,358 మంది ఉత్తీర్ణులయ్యారు. రాష్ట్రంలో మూడో స్థానంలో నిలిచారు. ఈసారి జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపే విధంగా ప్రణాళికాబద్ధంగా విద్యాశాఖ ముందుకు వెళుతోంది.

సెలెస్టియల్ హైస్కూల్‌లో వీడ్కోలు వేడుకలు

సిరిసిల్ల రూరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల పట్టణంలోని అశోక్‌నగర్‌లోని సెలెస్టియల్ ఇంగ్లీష్ హైస్కూల్‌లో అదివారం పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యాలు అకట్టుకున్నాయి. అనంతరం జరిగిన సమావేశంలో సిరిసిల్ల మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి మాట్లాడారు.కార్యక్రమంలో కరస్పాండెంట్ బుర్ర రాధకృష్ణప్రసాద్‌గౌడ్, తాజా మాజీ కౌన్సిలర్ అకుల చిన్న, ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ శోభరాణి, వైస్ ప్రిన్సిపాల్ మచ్చ ఇందిర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎద్దుగుట్ట మల్లన్న బ్రహోత్సవాలు ప్రారంభం


సిరిసిల్ల పెద్దూర్‌లో ఎద్దుగుట్ట మల్లన్నకు గంపలతో ఊరేగింపు

సిరిసిల్ల రూరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూర్, బోనాల గ్రామాల శివారులో ఉన్న ఎద్దుగుట్ట మల్లిఖార్జునస్వామి బ్రహోత్సవాలు అదివారం ప్రారంభమయ్యాయి. పెద్దూర్, బోనాల గ్రామాల్లోని యాదవ సంఘాల అధ్వర్యంలో అదివారం రాత్రి పుట్టమన్నుతో పాటు బోనాలను మహిళలు నెత్తిన పెట్టుకోని ఒగ్గు పూజారుల డప్పువాయిద్యాలతో ఎద్దుగుట్ట మల్లన్న అలయానికి తరలివెళ్లారు. మల్లన్న అలయంలో మహిళలు తీసుకోచ్చిన పుట్టమన్నుతోఅలికి మల్లన్నపట్నం వేసి బోనాలతో ప్రత్యేక పూజలు ఓగ్గు పూజారులు కన్నుల పండువగా నిర్వహించారు. సోమవారం ఉదయం అలయంలో నాగవెల్లి పట్నం వేసి మల్లిఖార్జున స్వామి కళ్యాణాన్ని నిర్వహించడంతోపాటు అన్నదానం చేసేందుకు యాదవ సంఘాల అధ్వర్యంలో భారీగా ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం నభ్యులు, గోపాల యూత్ సభ్యులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్, కేటీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం


కేసీఆర్, కేటీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న రైతులు, నాయకులు

తంగళ్లపల్లి, ఇల్లంతకుంట మార్చి16(ఆంధ్రజ్యోతి): ఇల్లంతకుంట మండలం దాచారం బానప్ప చెరువు వద్ద కేసీఆర్, కేటీఆర్ చిత్రపటాలకు దాచారం, తంగళ్లపల్లి మండలం రాంచంద్రపూర్ గ్రామానికి చెందిన రైతులు, నాయకులు క్షీరాభిషేకం చేశారు. ఈనెల2వ తేదిన కేటీఆర్ జిల్లెల్లను సందర్శించినప్పుడు సాగునీటి కోసం రైతులు మొరపెట్టుకుంటే సంబంధిత అధికారులతో మాట్లాడి రంగనాయక సాగర్ నుండి జక్కపూర్ కాలువ ద్వారా బానప్ప చెరువులకు నీళ్లు వచ్చేందుకు కృషి చేశాడని రైతులు, నాయకులు తెలిపారు. కృతజ్ఞతగా కేసీఆర్, కేటీఆర్ చిత్రపటానికి బానప్ప చెరువు వద్ద క్షీరాభిషేకం నిర్వహించినట్లు తెలిపారు.

కాంగ్రెస్ నాయకులపై పోలీసులకు ఫిర్యాదు

తంగళ్లపల్లి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ప్రజాక్షేత్రంలో ఉన్న నాయకులు కేసీఆర్, కేటీఆర్, జగదీశ్వర్‌రెడ్డిల దిష్టిబొమ్మలు దహనం చేసిన కాంగ్రెస్ నాయకులపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకులు తంగళ్లపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు గజభీంకర్ రాజన్న ఆధ్వర్యంలో నాయకులు ఎస్ఐ రాంమోహన్‌కు పిర్యాదును అందించారు. బీఆర్ఎస్ నాయకులు బొల్లి రాం మోహన్, రాజన్నలు, పడిగెల రాజు, మాట్ల మధు, కొయ్యడ రమేశ్, కోడి అంతయ్య, అంకారపు రవీందర్, బండి జగన్, గుండి ప్రేమ్‌కుమార్, కుంటయ్య, రామ గౌడ్, జక్కుల నాగరాజు తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్ నాయకుడి అరెస్ట్

తంగళ్లపల్లి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ నాయకుడు జల్లం ప్రవీణ్, బీఆర్ఎస్ నాయకుడు మాట్ల మధులు ఒకరిపై ఒకరు పలు ఆరోపణలు చేసుకుంటూ ఆదివారం బహిరంగ చర్చ అంటూ సవాల్ విసురుకున్న నేపథ్యంలో ముందస్తుగా మాట్ల మధును తంగళ్లపల్లి పోలీసులు ఆదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ మండల శాఖ అధ్యక్షుడు గజభీంకర్ రాజన్న, నాయకులు కొయ్యడ రమేశ్, కోడి అంతయ్య, కుంటయ్య తదితరులు పోలీస్ స్టేషన్‌కు వెళ్లి మధును పరామర్శించారు. మాట్ల మధును అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండించారు.

సభకు తరలిన కార్మికులు..

వీర్నపల్లి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గ్రామపంచాయతీ కార్మికులు, సీపీఐ(ఎం) నాయకులు జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సీపీఐ(ఎం) విస్తృత స్థాయి సమావేశానికి ఆదివారం బైక్ ర్యాలీగా తరలివెళ్లారు. కార్మికుల సమస్యలను పరిష్కరించాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యవర్గ సభ్యుడు మల్లారపు అరుణ్ కుమార్, గ్రామపంచాయతీ కార్మికుల సంఘం మండల అధ్యక్షుడు నర్సయ్య, కార్మికులు, నాయకులు పాల్గొన్నారు.

రైతు చర్చ మండలి కమిటీ

ఎల్లారెడ్డిపేట, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని రైతు చర్చ మండలి నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గుండం సుధాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా గోలిపల్లి భాస్కర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా సాధు పద్మారెడ్డి, కోశాధికారిగా సందుపట్ల బాపురెడ్డి, రైటర్‌గా మద్దుల బాలకిషన్‌రెడ్డిలు ఎన్నికయ్యారు. 15 మందిని కార్యవర్గ సభ్యులుగా నియమించారు. సంఘం సభ్యుల సమస్యల పరిష్కారానికి పాటు పడుతామని కమిటీ సభ్యులు పేర్కొన్నారు. నూతనంగా ఎన్నికైన సభ్యులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ఎల్లారెడ్డిపేట, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాజన్నపేటలోని బీఆర్ఎస్ నాయకులు తోకల శివారెడ్డి తండ్రి అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య, ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, తాజా, మాజీ జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు తదితరులు మృతదేహాన్ని సందర్శించారు. పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి ధైర్యంగా ఉండాలని సూచించారు. నాయకులు రమేశ్, సుభాష్, నర్సింహారెడ్డి, శ్రీనివాస్, దేవరెడ్డి, శంకర్ తదితరులు ఉన్నారు.

రేపాకలో ఇఫ్తార్ విందు

ఇల్లంతకుంట, మార్చి 16(ఆంధ్రజ్యోతి) : మండలంలోని రేపాకలోని మజీద్‌లో యువజన సంఘాల అధ్యక్షుడు బేంద్రం తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి ముస్లింలకు ఇఫ్తార్ విందును అందించారు. రాంసాగర్, అంతగిరి అనిల్, గజ్జెల శ్రీనివాస్, కేశవనేని భూమేష్, మౌలాలీసాబ్, ముంషాద్, ఎండీ సలావోద్దీన్, షబ్బీర్, సాధిక్, హకీం, షమీర్, కుర్షిద్, రేహన్, అహద్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్, కేటీఆర్, జగదీష్‌రెడ్డి దిష్టిబొమ్మల దహనం


ముస్తాబాద్‌లో శవయాత్ర నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు


ఎల్లారెడ్డిపేటలో దిష్టిబొమ్మలను దహనం చేస్తున్న నాయకులు

సిరిసిల్ల టౌన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను ఏకవచనంతో సంభోదించి శాసన సభ సాక్షిగా అవమానించారని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం సిరిసిల్ల పట్టణం అంబేద్కర్ చౌరస్తాలో ఎమ్మెల్యే, మాజీ సీఎం కేసీఆర్, ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు కేటీఆర్, జగదీష్‌రెడ్డి దిష్టిబొమ్మలు దహనం చేసి నాయకులు నిరసనలు వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిరిసిల్ల పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, టీపీసీసీ అధి కార ప్రతినిధి చక్రధర్‌రెడ్డి, టీపీసీసీ సభ్యుడు సంగీతం శ్రీనివాస్ మా ట్లాడారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్, వెల్మల స్వరూపతిరుపతిరెడ్డి, డైరెక్టర్ వెంకటేశం, కాంగ్రెస్ పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి మ్యాన ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంగళ అశోక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు అకు నూరి బాలరాజు, చేనేత సెల్ జిల్లా అధ్యక్షుడు గోనె ఎల్లప్ప, మహిళ జిల్లా అధ్యక్షురాలు కాముని వనిత, పీసీసీ మాజీ కార్యదర్శి గడ్డం నర్స య్య, మాజీ కౌన్సిలర్లు రెడ్యానాయక్, రాగుల జగన్, సిరిసిల్ల అర్బన్ బ్యాం క్ మాజీ డైరెక్టర్ నేరెళ్ళ శ్రీకాంత్‌గౌడ్, మున్నూరు కాపు సంఘం జిల్లా అధ్యక్షుడు బొప్ప దేవయ్య, సిరిసిల్ల పద్మశాలి సంఘం అధ్యక్షుడు గోలి వెంకటరమణ, కాంగ్రెస్ నాయకులు కంసాల మల్లేశం, అన్నల్‌దాస్ భాను, కిరణ్, చందన, రోజా పాల్గొన్నారు.

● ఇల్లంతకుంట : మాజీ మంత్రి జగదీశ్వర్‌రెడ్డి దిష్టిబొమ్మను కాంగ్రెస్ నాయకులు దహనం చేశారు. మండలకేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో ఆదివారం నిరసన చేపట్టారు. మండలశాఖ అధ్యక్షుడు భూంపెల్లి రాఘవరెడ్డి, నియోజకవర్గ అధికార ప్రతినిధి పసుల వెంకటి, నాయకులు అంతగిరి వినయ్‌కుమార్, మామిడి నరేష్, బద్దం హన్మంతరెడ్డి, ఒగ్గు రమేష్, జమాల్, వీరేశం. రజనీకాంత్, రాజేశం, నవీన్‌రెడ్డి, బాలరాజు, మామిడి రాజు, కాసుపాక రమేష్, విజయ్, బాల్‌రెడ్డి, మధు, నర్సయ్య, జ్యోతి, బెజ్జంకి శ్రీనవాస్ పాల్గొన్నారు.

● గంభీరావుపేట : మండల కేంద్రంలోని తెలంగాణ అమర వీరుల స్థూపం వద్ద మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రులు కేటీఆర్, జగదీశ్వర్‌రెడ్డిల దిష్టిబొమ్మలను దహనం చేశారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిది పర్శ హన్మండ్లు, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కొమిరిశెట్టి తిరుపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి మూల రామచంద్రారెడ్డి, సోషల్ మీడియా ఇన్‌చార్జీ గౌరి శంకర్, నాయకులు భూమరాజం, పర్శరాములు, నాగరాజు, సురేష్, రాజు, రాజశేఖర్, రాఘవేందర్‌రెడ్డి, నర్సింలు, లచ్చయ్య, మహేందర్, నాంపెల్లి, రాజుగౌడ్, ప్రవీన్ తదితరులు ఉన్నారు.

● ముస్తాబాద్ : మండల కేంద్రంలోని రాజీవ్ కూడలిలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు కేటీఆర్, జగదీశ్‌రెడ్డిల దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఆదివారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి దిష్టిబొమ్మకు శవయాత్ర నిర్వహించి ప్రధాన కూడలిలో దిష్టిబొమ్మను దహనం చేశారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి కొండం రాజిరెడ్డి, పట్టణఅధ్యక్షుడు గజ్జెల రాజు, శీల ప్రశాంత్, రంజాని నరేశ్, తలారి నర్సింలు, తాళ్ల విజయ్‌రెడ్డి, మిరుదొడ్డి భాను, కొండయ్య, గాంత రాజు, కొండల్‌రెడ్డి, బాలసాని శ్రీనివాస్, మహేందర్, అంజనేయులు, భాను, దుబ్బాక రాజు, కొమురయ్య పాల్గొన్నారు.

● తంగళ్లపల్లి : మండల కేంద్రంలో కేసీఆర్, కేటీఆర్, జగదీశ్వర్‌రెడ్డిల దిష్టిబొమ్మలను కాంగ్రేస్ నాయకులు దహనం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మునిగెల రాజు, భైరిసేని రాము, జుపల్లి రాజేశ్వరావు, ఆరెపల్లి బాలు, మందాటి తిరుపతి, చుక్క శేఖర్, గుగ్గిళ్ల భరత్‌గౌడ్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

● వీర్నపల్లి : మండల కేంద్రంలో ఆదివారం కాంగ్రెస్ నాయకులు దిష్టిబొమ్మను దహనం చేశారు. మండల అధ్యక్షుడు భూత శ్రీనివాస్ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ రాములు నాయక్, వైస్ చైర్మన్ లెంకెల లక్ష్మణ్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బిటి యాదవ్, గ్రామశాఖ అధ్యక్షుడు పెద్దనపల్లి చంద్రమౌళి, బీసీ సెల్ అధ్యక్షుడు బోనాల శ్రీనివాస్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు తుడుం రవి, సీనియర్ నాయకులు లెంకల జనార్దన్, గుమ్మడి రాజేశం, గంగాధరి సంజీవ్, ప్యాట్ల మల్లయ్య, దయ్యాల అంజయ్య, కన్నం దేవరాజ్, తదితరులు పాల్గొన్నారు.

● కోనరావుపేట : మండల కేంద్రంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో కేటీఆర్, జగదీశ్వర్‌రెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేశారు. కోనరావుపేట మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య, కాంగ్రెస్ జిల్లా నాయకుడు జగన్మోహన్‌రెడ్డి, మండల అధ్యక్షుడు ఫిరోజ్ పాషా మాట్లాడారు. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తాళ్లపల్లి ప్రభాకర్, కాంగ్రెస్ నాయకులు నందు గౌడ్, బుర్ర రవీందర్, నరసింహ చారి, గొట్టే రుక్మిణి, రమేష్ రెడ్డి, సదానందం, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు లింబయ్య తదితరులు పాల్గొన్నారు.


● ఎల్లారెడ్డిపేట : మండల కేంద్రంలో మాజీ సీఎం కేసీఆర్ ఎమ్మెల్యేలు కేటీఆర్, జగదీశ్వర్‌రెడ్డిల దిష్టిబొమ్మలను స్థానిక నాయకులతో కలిసి ఆదివారం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య దహనం చేశారు. మాజీ సీఎం కేసీఆర్, ఎమ్మెల్యేలు కేటీఆర్, జగదీశ్వర్‌రెడ్డిలకు వ్యతిరేకంగా నినదించారు. ప్రభుత్వం మారిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, నాయకులు అహంకారం తగ్గడం లేదని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో నాయకులు రాంరెడ్డి, గౌస్, గిరిధర్‌రెడ్డి, బాబు, బుచ్చాగౌడ్, రాజునాయక్, పర్శరాములు, రవి, మల్లారెడ్డి, దేవయ్య, శ్రీనివాస్, నారాయణరెడ్డి, బాలయ్య, శ్రీకాంత్‌రెడ్డి, ఎల్లాగౌడ్, రమేశ్, బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● చందుర్తి : మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేటీఆర్, జగదీశ్ రెడ్డిల దిష్టిబొమ్మల ఆదివారం దహనం చేశారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చింతపంటి రామస్వామి, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు నాగం కుమార్, ఏసుదాసు, అజయ్, ప్రభాకర్, సత్తయ్య, రామచంద్రం, రాజయ్య, మల్లేశం, మధు, తదితరులు పాల్గొన్నారు.


చందుర్తిలో దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

● రుద్రంగి : మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద కేటీఆర్, జగదీష్‌రెడ్డి దిష్టిబొమ్మలను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో దహనం చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ చెలుకల తిరుపతి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తూం జలపతి, మాజీ జడ్పీటీసీ గట్ల మీనయ్య, తర్రె మనోహర్, ఎర్రం గంగనర్సయ్య, గడ్డం శ్రీనివాస్ రెడ్డి, కెసిరెడ్డి నర్సారెడ్డి, గండి నారాయణ, తర్రె లింగం, కోమిరె శంకర్, పల్లి గంగాధర్, పిడుగు లచ్చిరెడ్డి, మాడిశెట్టి అభిలాష్, ఎర్రం రాజలింగం, పడాల శ్రీని వాస్, సూర యాదయ్య, స్వర్గం పరందామ్, పూదరి మహిపాల్, ఎర్రం అరవింద్, దయ్యాల శ్రీనివాస్, అక్కనపెల్లి శ్రీనివాస్, ద్యావల దిలీప్, బండపల్లి సన్నీ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ చట్టాన్ని అసెంబ్లీలో ఆమోదించాలి


కలెక్టరేట్ ఎదుట రిలే దీక్షలో పాల్గొన్న ఎమ్మార్పీఎస్ నాయకులు

సిరిసిల్ల కలెక్టరేట్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ చట్టాన్ని అసెంబ్లీ ఆమోదించాలని ఎమ్మార్పీఎస్ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు బడుగు లింగయ్య డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ప్రధాన ద్వారం ఎదుట ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ జిల్లా కమిటీల అధ్వర్యంలో చేపట్టిన రిలేనిరహార దీక్షలు ఆదివారం 7వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో మంగళి చంద్రమౌళి, తంగళ్లపల్లి మండల అధ్యక్షుడు సావనపెల్లి బాలయ్య, కృష్ణభగవాన్, మాల్లారపు నరేష్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

● ఇల్లంతకుంట : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో చేపట్టిన నిరసన దీక్ష ఆదివారానికి 4వరోజుకు చేరింది. ఎమ్మార్పీఎస్ జిల్లా కోకన్వీనర్ సావనపెల్లి రాకేష్‌మాదిగ మాట్లాడారు. నిరసన దీక్షకు బీఆర్ఎస్ నాయకుడు కూనబోయిన రఘు సంఘీభావం ప్రకటించారు. కార్యక్రమంలో ప్రధానకార్యదర్శి సావనపెల్లి శంకర్, ఉపాధ్యక్షుడు కాసుపాక శంకర్, నాయకులు రాగటి దేవదాస్, శంకర్, రాములు, రాజు, ఆనంద్, మల్లయ్య, రమేష్, శ్రీకాంత్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

● ముస్తాబాద్ : మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ ఎదుట ఎంఆర్పీఎస్ ఆధ్వర్యంలో ఆదివారం నిరసన దీక్షలు ప్రారంబిచారు. దీక్షలకు జాతీయ ఆర్పీఐ జిల్లా అధ్యక్షుడు ఎండీ జహంగీర్ మద్దతు తెలిపారు. కొమ్మెట రాజు, సుంచు మల్లయ్య, మాదూరి కిషన్, బుచ్చయ్య, సుంచు బాబు, నర్సింలు పాల్గొన్నారు.

● కోనరావుపేట : మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చేస్తున్న రిలే నిరాహార దీక్ష ఆరో రోజుకు చేరుతుంది. ఎలగందుల బిక్షపతి, కొమ్ము రాజశేఖర్, కర్రోళ్ల మోహన్, దేవరాజు, దేవయ్య, ప్రశాంత్, రాజు తదితరులు పాల్గొన్నారు.

● ఎల్లారెడ్డిపేట : మండలకేంద్రంలో ఎమ్మార్పీఎస్ నాయకులు చేపట్టిన నిరసన దీక్ష ఆదివారం రెండో రోజుకు చేరుకుంది. నాయకులు లక్ష్మణ్, శరవింద్, నర్సయ్య, దేవయ్య, కనకరాజు, శ్రీనివాస్, దేవదాస్, మల్లేశం, గోవర్ధన్, ఊశయ్య, లింగయ్య పాల్గొన్నారు.

● చందుర్తి : మండల కేంద్రంలో చేపట్టిన నిరసన దీక్ష ఆదివారం 6వ రోజు కొనసాగింది. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు తర్రి శంకరయ్య, నాయకులు దుమ్ము రమేష్, లింగంపల్లి అర్జున్, ఆశయ్య, లక్ష్మన్, రాజదాసు, రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

చందుర్తిలో సీఎం దిష్టిబొమ్మ దహనం


చందుర్తిలో సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

చందుర్తి మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యే జగదీశ్వర్‌రెడ్డిల దిష్టిబొమ్మను దహనం చేయడాన్ని నిరసిస్తూ సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను ఆదివారం దహనం చేశారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మ్యాకల ఎల్లయ్య, మాజీ ఎంపీపీ చిలక పెంటయ్య, మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్లు ఏనుగుల శ్రీనివాస్, డప్పుల అశోక్ నాయకులు దుమ్మ అంజయ్య, కొమ్ము రమేష్, ఇస్మాయిల్, పులి మనోహర్, రమేష్‌రావు, ప్రసాద్, వెంకటేశం, వంశి, పరుశురాం, రాజు, అశోక్, జీవ న్, శ్రావణ్, సమీర్, రాకేష్ గంగ నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం ఢీ.. ఒకరి పరిస్థితి విషమం

తంగళ్లపల్లి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన ఎడ్ల విజయ(60) ఆదివారం రాత్రి రోడ్డు దాటుతున్న క్రమంలో గుర్తు తెలియని ద్విచక్ర వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడింది. 108 వాహనంలో సిరిసిల్లలో ప్రధాన ఆసుపత్రికి తరలించారు. విజయ పరిస్థితి విషమంగా మారడంతో కరీంనగర్‌కు తరలించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగా ఉంది.